PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 100 | విజయవాడ, శుక్రవారం 11 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 11 November 2022 | Rs



గృహనిర్బంధంలో గౌతమ్ నవలఖ

లోపలి పేజీలో..



డిమాండ్స్ డే విజయవంతం చేయండి

- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ పిలుపు

లోపలి పేజీలో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాజకీయ పార్టీల నాయకులు (- వార్త 3వ పేజీలో)

మాంద్యం కోరల్లో...
గ్రామీణ భారతం విలవిల

- పెరగని కొనుగోళ్లు • వినిమయ సరుకుల విక్రయాలు అధోగతే • ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్ : గ్రామీణ భారతం మాంద్యం కోరల్లో చిక్కుకుంది. గ్రామస్తుల కొనుగోలు శక్తి రోజురోజుకీ పడిపోతోంది. వరసగా నెలల తరబడి ఈ పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళనకరంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ గ్రామీణుల కొనుగోలు శక్తి పెరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితికొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేగంగా అమ్ముడుబోయే వస్తువులు (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ - ఎఫ్‌ఎంసిజి) మార్కెట్ కూడా గ్రామీణ ప్రాంతాల్లో అంతంతమాత్రంగానే ఉందని నీల్సన్ ఐక్యూ తాజా అధ్యయనంలో తేలింది. సబ్బులు, షాంపూలు, బిస్కట్లు, నోట్‌బుక్స్,చాక్‌లేట్లు, పాల ఉత్పత్తులు, ఫెయిర్‌నెస్ క్రీములు వంటి వస్తువులకు మార్కెట్‌లో భారీ డిమాండ్ వుండే విషయం తెలిసిందే. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో గ్రామీణ ప్రాంతాల్లో ఈ వస్తువుల వినిమయం 3.6 శాతం పడిపోయింది. జూన్‌తో అంతమైన త్రైమాసికంలో అంతకుముందుతో పోలిస్తే ఈ తరహా వస్తువుల వినిమయం గ్రామీణ ప్రాంతాల్లో 2.4 శాతం క్షీణించిందని తేల్చారు. తాజా అధ్యయనంలో



అంతకన్నా తక్కువకు విక్రయాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో కొంతమేర పెరుగుదల నమోదైనప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో తగ్గడంతో మొత్తంమీద ఎఫ్‌ఎంసిజి రంగంలో వ్యతిరేక ఫలితాలు వ్యక్తమయ్యాయి. నీల్సన్ ఐక్యూ రిపోర్టు ప్రకారం జులై- సెప్టెంబర్ కాలంలో పట్టణ మార్కెట్లలో ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తుల వినిమయం 1.2 శాతం పెరిగింది. ఇంతక్రితం త్రైమాసికంలో ఇది 0.6 శాతంగా నమోదయ్యింది. స్థూలంగా దేశంలో ఎఫ్‌ఎంసిజి రంగం అమ్మకాలు 0.9 శాతం క్షీణించాయి.

ఎందుకీ స్థితి...

దేశంలో ద్రవ్యోల్బణం భారీగా పెరగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో ద్రవ్యోల్బణం అదుపు కావడం లేదు. దీంతో ఆహారపదార్థాల ధరలే చుక్కలు దాటుతున్నాయి. కూరగాయల ధరలుకూడా పైపైకే ఎగబాకుతున్నాయి. అదే సమయంలో నిజవేతనాలు దారుణంగా పడిపోయాయి. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి అంతంతమాత్రంగానే ఉండటంతో, గ్రామాలపైన ఒత్తిడి పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో తిండి గింజలకు ఖర్చు చేయడమే కష్టంగా మారుతోంది. ఫలితంగా ఇతర వస్తువుల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించుకుంటున్నారు.

ప్రమాద ఘంటిక : నీల్సన్ ఐక్యూ

ఈ పరిస్థితిని ప్రమాద ఘంటికగా నీల్సన్ ఐక్యూ పేర్కొంది. ఆ సంస్థ ఇండియా మేనేజింగ్ డైరక్టర్ సతీష్ పిల్లయి ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మందగమనం, నిరంతరం పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఈ పరిస్థితికి కారణంగా పేర్కొన్నారు.

'అమ్మకాలు తగ్గడంతో సాంప్రదాయ వర్తక రిటైలర్లు తక్కువ స్టాక్‌లను పెట్టుకుంటున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తయారీదారులు రిటైల్ వర్తకులకు మద్దతు ఇవ్వాలి. అని ఆయన సూచించారు.

చిన్న ప్యాక్‌లలోనే కొంటున్నారు

ధరలు అధికంగా ఉండటంతో భారీ పరిమాణాల్లో కొనడానికి వినియోగదారులు సిద్ధపడటం లేదు. దీంతో వివిధ సంస్థలు తమ

ఉత్పత్తులను చిన్నచిన్న ప్యాక్‌లలో అందిస్తున్నాయని,వాటికే డిమాండ్ ఉంటోందని సర్వేలో తేలింది. ఇటీవల కాలంలో అనేక సంస్థలు తమ ఉత్పత్తులను విక్రయించడానికి చిన్న ప్యాక్‌లను తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్లు సర్వేపేర్కొంది.

సెయిల్‌లో విలీనం..
మరో జిమ్మిక్కు!

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు, రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటన నేపథ్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విభజన హామీల సాధన కోసం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ప్రజానీకం సిద్ధమౌతోంది. ప్రధాని పర్యటన సాగే శుక్ర, శని వారాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వివిధ కార్మిక, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ఉక్కు నగరం విశాఖలో ఇప్పటికే నిరసనల ప్రభావం కనిపిస్తోంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 635 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న కార్మికులు, నగర ప్రజానీకం రెండు రోజుల నుండి వాటిని ఉధృతం చేశారు. ప్రదర్శనలు, ధర్నాలు, సభలతో విశాఖ మారుమ్రోగుతోంది. ప్లాంటుకు నల్లబ్యాడ్జీలతో కార్మికులు విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో బిజెపి నాయకులు ఒక వ్యూహం ప్రకారం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం అంశాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. సెయిల్ బోర్డులో చర్చించినట్లు, ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత పర్యటనలో కాకుండా 2023లో మరోమారు ప్రధాని విశాఖకు వస్తారని, అప్పుడు సెయిల్‌లో విలీనం గురించి ప్రకటన చేస్తారని, అందువల్ల నిరసనలు తెలపకుండా సహకరించాలని కోరుతున్నారు. బిజెపి నాయకులు చేస్తున్న ఈ ప్రచారం కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది. బిజెపి నాయకులు చెబుతున్నట్లు నిర్ణయం జరిగిఉంటే, ప్రకటన మిగతా 2లో

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకాన్ని నిలిపేస్తున్నట్టు ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మికులు నినదించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు మేరకు ప్లాంట్‌లోని అన్ని డిపార్టుమెంట్లలో గురువారం 'డిమాండ్స్ డే'ను నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. సొంత గనులు కేటాయించి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని కోరారు. ఇదిలా ఉండగా సామూహికంగా కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించాలని పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఆ మేరకు వివిధ విభాగాల్లో గురువారం సన్నాహక సమావేశాలు జరిగాయి.

వాయిదాల పద్ధతిలో 5 స్టార్ ఫ్యాన్లు, ఏసిలు

- డిస్కంలు, సిడ్కో ప్రతిపాదనకు ఏపిఇఆర్‌సి ఆమోదం
- విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాల్లో పైలట్ ప్రాజెక్టు

లోపలి పేజీల్లో..

బడి చదువు దక్కలేదు! ఆన్‌లైన్ దిక్కులేదు !

- 43 శాతం మంది విద్యార్థుల పరిస్థితి
- కరోనా సమయంలో 19 నెలల పాటు ఇదే తీరు
- ఒఒఎస్‌సి అధ్యయనంలో వెల్లడి



రాష్ట్ర ప్రయోజనాల కోసం
నిలబడి ప్రశ్నిస్తారా?

- లేక మోకాళ్లు వంచి లొంగిపోతారా?
- వైసిపి ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ప్రశ్న

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజలపై వైసిపి ప్రభుత్వానికి ఏ మాత్రం గౌరవం ఉన్నా ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిరక్షణపై ప్రశ్నించేందుకు విశాఖ పట్నం వేదిక కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..2014 విశాఖలో ప్రత్యేక హోదా ఇస్తామని మోడీ చెప్పారని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను తుంగలో తొక్కి, చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను సైతం రద్దు చేసి, రాష్ట్రానికి ప్రధాని మోడీ వెన్నుపోటు పొడిచి విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారని తెలిపారు. అటువంటి ప్రధానికి సత్కారాలు, సన్మానాలు చేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీయటమేనని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడి మోడీని ప్రశ్నిస్తుందా? లేక మోకాళ్లు వంచి లొంగితుందా? అని ప్రశ్నించారు.

మోడీ ప్రధాని అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క మంచి పనిచేయలేదు. విశాఖ సభ సందర్భంగా వైసిపి చేస్తున్న హడావుడి చూస్తుంటే ప్రధాని వైసిపినా లేక వైసిపి బిజెపిలో కలిసిపోయిందా? అనే అనుమానం కలుగుతుందని విమర్శించారు. దేశంలో ఎక్కడా ప్రజల ఆదాయంతో ప్రధాని బహిరంగ సభలు జరగలేదన్నారు. దీనికి భిన్నంగా విశాఖలో ప్రభుత్వ ఖజానా నుండి సొమ్ము వెచ్చిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం ఒరగబెట్టిందని ఈ హడావుడి చేస్తున్నారని, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల సొమ్మును ఖర్చు పెడతారా? అని ప్రశ్నించారు. ఈ సభ కోసం ఆంధ్ర యూనివర్సిటీలో మూడు రోజులుగా చెట్లను ధ్వంసం చేస్తున్నారని, చిరువ్యాపారులను సైతం వెళ్లగొట్టారన్నారు. ధ్వంసం చేయడం, నిర్మూలించటం, కూలగొట్టడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అలవాటుగా మారిందన్నారు.

విభజన హామీల గురించి మాట్లాడుతూ.. రైల్వే జోన్ వస్తుందని గత కొంతకాలంగా ప్రచారం చేశారన్నారు. తీరా ఇప్పుడు డివిజన్ ఎత్తేస్తాం.. జోన్ ఇస్తామంటున్నారని తెలిపారు. అంటే రెండు కళ్లల్లో ఒక కన్ను పీకేస్తామని చెబుతున్నారని విమర్శించారు. విశాఖలో ప్రతిష్టాత్మకమైన ఉక్కు ఫ్యాక్టరీ రూ.900 కోట్ల లాభాల్లో ఉన్నా నష్టాలు వస్తున్నాయని చెబుతూ అమ్మేయడానికి కేంద్రం సిద్ధపడుతోందన్నారు. బిజెపి మినహా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నా ధైర్యంగా విశాఖపట్నంలో సభ నిర్వహించేందుకు ప్రధాని వస్తున్నారంటే, దీనికి రాష్ట్ర మిగతా 2లో

పశ్చిమలో విషాదం

- బాణసంచా తయారీలో భారీ పేలుడు
- ఐదుగురి దుర్మరణం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్


పశ్చిమగోదావరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలోని బాణాసంచా కర్మాగారంలో గురువారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అన్నవరం అనే వ్యక్తి కడియద్దలో బాణాసంచా మందుగుండు తయారీ కర్మాగారం నిర్వహిస్తున్నాడు. ఊనగట్ల, జగ్గన్నపేట, కడియద్దకు చెందిన నిరుపేదలు ఈ కర్మాగారం పనిచేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. క్షతగాత్రులను గ్రామస్తులు తమ ద్విచక్ర వాహనాలపై తరలించారు. పేలుడు దాటికి కర్మాగారం గోడలు, సమీపంలోని ఇంటి గోడలు ధ్వంసమయ్యాయి. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో
'అరబిందో' శరత్ చంద్ర అరెస్టు

- ఏడు రోజుల ఇడి కస్టడీ



శరత్ చంద్రారెడ్డి



వినయ్‌బాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరబిందో డైరెక్టర్ పెనక శరత్ చంద్రారెడ్డి, పెర్నోడ్ రికార్డ్ ఇంటర్నేషనల్ బ్రాండ్స్ జనరల్ మేనేజర్ వినయ్‌బాబును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టులో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు వారిని హాజరు పరిచారు. దాదాపు గంటన్నరపాటు విచారణ తరువాత ఏడు రోజుల పాటు ఇడి కస్టడీకి అనుమతిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకె నాగపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు కలుసుకునేందుకు అవకాశం ఇచ్చింది. రోజూ వైద్య పరీక్షలు చేయాలని, సిసి టివిల పర్యవేక్షణలోనే విచారణ చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ నవంబర్ 17కు వాయిదా వేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో శరత్‌చంద్రారెడ్డిని కీలక సూత్రధారిగా పేర్కొంటూ సిబిఐ కోర్టుకు ఇడి రిమాండ్ రిపోర్టు అందజేసింది. సౌత్ గ్రూప్‌తో రూ.100 కోట్లు, వినయ్ బాబుతో రూ.100 కోట్ల ముడుపులు చెల్లించారని, శరత్ చంద్రారెడ్డికి చెందిన మూడు కంపెనీలతో ఇప్పటివరకు రూ.64.35 కోట్లు అక్రమంగా సంపాదించారని ఇడి తెలిపింది. రూ.60 కోట్లు ఇండో స్పిరిట్స్ కంపెనీకి తరలించారని పేర్కొంది. ఇండో స్పిరిట్స్ కోసం ఎక్సెస్ క్రెడిట్ నోట్స్ ఇచ్చారని, తద్వారా రిటైల్ బిజినెస్‌లో శరత్ చంద్రారెడ్డికి లబ్ధి చేకూరేలా ప్రణాళిక చేశారని తెలిపింది. 14 రోజుల కస్టడికి అప్పగించాలని ఇడి కోరింది. ఇడి ఆరోపణలను నిందితుల తరపు న్యాయవాదులు ఖండించారు. విచారణ పేరుతో తమ ఉద్యోగులను వేధిస్తున్నారని, ఉద్యోగి చందన్‌ను కొట్టడంతో చెవి పనిచేయడం లేదని, మహిళా ఉద్యోగులను సైతం రాత్రి పూట విచారణకు రమ్మంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిణామాలు మళ్లీ తలెత్తకూడదని ప్రత్యేక కోర్టు తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అభిషేక్ బోయిన్‌పల్లిని సిబిఐ అరెస్ట్ చేసింది.



నేడు మోడీతో పవన్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోడీని జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం సాయంత్రం కలవనున్నారు. రాత్రి 8.30 గంటలకు పవన్ కల్యాణ్ ప్రధానిని కలుస్తారని బిజెపి రాష్ట్ర నాయకులు తెలిపారు. ప్రధాని ర్యాలీలో పవన్ కల్యాణ్ పాల్గొంటారా? లేదా? అనే అంశంపై స్పష్టత లేదు. బేగంపేట విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానాశ్రయంలో పవన్ విశాఖ చేరుకోనున్నారు. ప్రధాని ఉండే రెండు రోజులూ పవన్ అక్కడే ఉండనున్నారు. గతంలో ఆయన విశాఖ పర్యటనను పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో ఈ పర్యటన సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది.

దళితులు మతం మారితే
ఒబిసిలే

- ఎస్సీ రిజర్వేషన్ కుదరదు
- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దళితుల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోమారు తన వివక్షతను బయటపెట్టుకుంది. క్రైస్తవ, ఇస్లాం మతాలను స్వీకరించిన దళితులకు షెడ్యూల్డ్ తరగతులు (ఎస్సీ) కింద ఎటువంటి ప్రయోజనాలు వర్తింపజేయలేమని పేర్కొంది. ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి) కింద ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో గురువారం నాడు అఫిడవిట్ దాఖలు చేసింది. మతంతో సంబంధం లేకుండా దళితులందరికీ ఎస్సీ కింద ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుగుతున్న సంగతి విదితమే. వందలాది సంవత్సరాల నుంచి హిందూ సమాజంలో ఉన్న అణచివేత వాతావరణం క్రైస్తవ, ఇస్లామిక్ సమాజంలోనూ ఉందని సూచించేందుకు ప్రామాణిక సమాచారం అందుబాటులో లేదని, అందువల్ల ఎస్సీలకు అర్హులైన ప్రయోజనాలను మతం



మారిన దళితులకు ఇవ్వలేమని కేంద్రం పేర్కొంది. ఇస్లాం, క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు కూడా షెడ్యూల్డు తరగతులు (ఎస్సీ) కింద రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలను కొనసాగించాలని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా ఈ పిటిషన్ దాఖలైంది. ఇతర మతాల్లోని దళితులు కూడా దళిత హిందువుల మాదిరిగానే అనేక బాధపడుతున్నారని అందులో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌కె కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా , జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ స్పందన కోరతూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అందులో భాగంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ గురువారం నాడు అఫిడవిట్ దాఖలు చేసింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాలకు చెందిన దళితులకు మాత్రమే షెడ్యూల్డ్ తరగతుల హోదాను కల్పించే 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధం కాదని తెలిపింది. అందులో క్రైస్తవ, ఇస్లాం మతాలను మినహాయించిందని, కనుక మిగతా 5లో



పొందూరు మండలం గోకర్ణపల్లిలో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు

సుడిదోమ పోటు

- వేలాది ఎకరాల్లో ఎండిపోతున్న వరి పంట
- శ్రీకాకుళం జిల్లాలోనే 62 వేల ఎకరాలకు నష్టం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం రాపాకకు చెందిన పి.సత్యారావు ఎకరాన్నర విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. సరిగ్గా పొట్ట దశ దాటి ఎన్ను వచ్చే సమయంలో సుడిదోమ సోకింది. నివారణకు రూ.700 విలువ గల క్రిమిసంహారక మందును మూడు పర్యాయాలు వాడారు. ఫలితం లేకపోగా పంటంతా వ్యాపించడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదే మండలం తాడివలసకు చెందిన కౌలు రైతు జి.వెంకటరావుది ఇదే పరిస్థితి. ఆయన నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరుగుతున్న తరుణంతో సుడిదోమ ఆశించింది. రెండుసార్లు క్రిమి సంహారక మందులను ఉపయోగించారు. ఇప్పటికే ఎకరా విస్తీర్ణం మేర పంటకు నష్టం వాటిల్లింది. ఇంకా దోమపోటు నియంత్రణలోకి రాకపోవడంతో పంట దక్కదన్న తీవ్ర నిరాశ నిస్పృహలో కూరుకుపోయారు. ఇప్పటివరకు రూ.60 వేలు మదుపు పెట్టారు. కౌలు ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.12 వేలు చెల్లించాల్సి ఉండడంతో ఏం చేయాలో తోచక తల్లడిల్లిపోతున్నారు.

శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 35.98 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లాల్లో పంట కోతలు మొదలయ్యాయి. ఇతర జిల్లాల్లోనూ మరో 15 నుంచి 20 రోజుల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. పంట అత్యంత కీలక దశలో ఉన్న సమయంలో సుడిదోమ సోకి రైతు వెన్ను విరిచేస్తోంది. సుడిదోమ దుబ్బులు అడుగున చేరి రసాన్ని పీల్చేస్తుండడంతో దోమ వ్యాపించిన ప్రాంతమంతా పంట ఎండిపోతోంది. క్రిమి సంహారక మందుల కోసం రైతులు ప్రయివేట్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. సుడిదోమ నివారణ మందులను వినియోగిస్తున్నా ఫలితం కనిపించకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

శ్రీకాకుళం జిల్లాలోనే 62 వేల ఎకరాలకు నష్టం

సుడిదోమతో ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 62.5 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 12.5 వేల ఎకరాల్లో పంట పూర్తి దెబ్బతింది. మరో 50 వేల ఎకరాల్లో పాక్షికంగా నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం జిల్లా వరకు ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఎకరాకు సగటున 20 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, ప్రస్తుతం పది నుంచి 12 క్వింటాళ్లకు మించి ధాన్యం రాదని రైతులు వాపోతున్నారు. సుడిదోమ సోకిన పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. అక్టోబరులో కురిసిన వర్షాలు, పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో సుడిదోమ వ్యాప్తికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎరువుల కొరత వల్ల పొటాష్ తగినంతగా వాడకపోవడమూ మరో కారణంగా భావిస్తున్నారు. విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు ఆర్‌బికెలు అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం విపత్తు సమయంలో రైతుభరోసా కేంద్రాల నుంచి సబ్సిడీలపై ఉచిత మందులను పంపిణీ చేసే ఆలోచన చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుడిదోమతో నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్స్ డే విజయవంతం చేయండి

- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 7వ మహాసభలో శశికుమార్
- కార్మిక చట్టాలు కాపాడుకోవాలి : గఫూర్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

నవంబర్‌లో దేశవ్యాప్తంగా జరిగే డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని కేరళ బిఓసి సంక్షేమ బోర్డు ఛైర్మన్, ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి వి.శశికుమార్ కోరారు. రెండు రోజులపాటు జరగనున్న బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 7వ మహాసభ గురువారం కృష్ణాజిల్లా గుడివాడలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గుడివాడలో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్‌టిఆర్ స్టేడియం మీదుగా ఓరుగంటి వెంకటేశ్వరరావు ప్రాంగణం (కొత్త మున్సిపల్ కార్యాలయం) సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్ బాషా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా శశికుమార్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కేరళలోని వామపక్ష ప్రభుత్వం అనేక విధానాలను అమలు చేస్తోందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులో 20 లక్షల మంది నిర్మాణ కార్మికులు నమోదైనారని తెలిపారు. 3.5 లక్షల మందికి ఏడాదికి రూ.650 కోట్లకుపైగా పింఛను అందిస్తోందన్నారు. రెండు లక్షల మంది వలస కార్మికులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసిందని తెలిపారు.. పని ప్రదేశంలో చనిపోయిన కార్మికులకు రూ.నాలుగు లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి లక్ష రూపాయలు చెల్లిస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ..కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డుకు చెందిన రూ.1250 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. ఈ నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేసిన కార్మిక నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పు చేసి కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందన్నారు. ఢిల్లీలో రైతులు చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని అసంఘటిత కార్మికులంతా ఐక్యంగా పోరాడి కార్మిక చట్టాలను కాపాడుకోవాలని కోరారు. సంపద సృష్టిస్తోన్న కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదన్నారు. మహాసభలో సిఐటియు జాతీయ కార్యదర్శి ఎం.సాయిబాబు ప్రారంభోపన్యాసం చేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. వి.ఉమామహేశ్వరరావు, ఎం.రమణారావు, అనసూయమ్మ, ఎ.గోపాల్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు, సిఐటియు కృష్ణాజిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ దశలో ట్రయల్ చేస్తారా?

- ఫలానా సెక్షన్ వర్తించదని మేజిస్ట్రేట్ ఎలా చెబుతారు?
- అయ్యన్న కేసులో హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

నిందితులకు ఫలానా సెక్షన్ వర్తించదని రిమాండ్ దశలో మేజిస్ట్రేట్ చెప్పడం ఆదిలోనే ట్రయల్ చేసినట్లు అవుతుందని హైకోర్టు తప్పుపట్టింది. టిడిపి నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కొడుకులు విజయ్, రాజేష్‌లను విశాఖలోని మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్‌కు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సిఐడి వేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి గురువారం విచారించారు. రిమాండ్ దశలో ఫలానా సెక్షన్ వర్తించదని మేజిస్ట్రేట్ ఎలా చెబుతారని న్యాయమూర్తి ప్రశ్నించారు. రాజధానిలో అసైన్డ్ భూముల కొనుగోళ్ల కేసులో నిందితులను రిమాండ్‌కు పంపేందుకు విజయవాడ కోర్టు తిరస్కరించడాన్ని కూడా సిఐడి సవాల్ చేసింది. అయ్యన్న కేసులో ఐపిసి సెక్షన్ 467 వర్తించదని రిమాండ్‌కు పంపేందుకు మేజిస్ట్రేట్ నిరాకరించారని, ఆ సెక్షన్ వర్తించదని బుధవారం మధ్యంతర ఆదేశాలిచ్చారని అయ్యన్న లాయర్ చెప్పారు. సిఐడి తరపున అదనపు అడ్వకేట్ జనరల్ (ఎఎజి) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదిస్తూ, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులనే జారీ చేసిందని, తొలి దశలోనే ఫలానా సెక్షన్ వర్తించదని రిమాండ్ కేసులో మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేయడం చెల్లదని అన్నారు. రాజధాని కేసులో నిందితుల తరపున కౌంటర్ వేస్తామని వారి న్యాయవాది చెప్పారు. ఈ కేసుల విచారణ ఈ నెల 28కి వాయిదా పడింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాజధాని అందరిదీ అయితే.. ఇళ్ల స్థలాలు అందరికీ ఇవ్వాలి కదా?

హైకోర్టులో ప్రభుత్వం వాదన

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిలో ఇతరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వరాదంటే అది ప్రజా రాజధాని ఎలా అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో వాదించింది. రాజధాని పెట్టుబడిదారుల కోసం కాదని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. రాజధాని నుంచి పేదలను బడాబాబులు, ధనవంతులు దూరం చేస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. భూమిచ్చిన వాళ్లకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే పేదలకు రాజధానిలో చోటు లేనట్లేనని అన్నారు. రాజధానిలో ఇతరులకు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా సిఆర్‌డిఎ చట్ట సవరణ జరిగిందన్నారు. సిఆర్‌డిఎ చట్ట సవరణ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాజధాని రైతు పరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఇతరులు దాఖలు చేసిన రిట్లను జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ తల్లాప్రగఢ మల్లికార్జునరావు డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. సిఆర్‌డిఎ తరపు వాదనల నిమిత్తం విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

క్షేత్రస్థాయికి ఐఎఎస్‌లు

- అభివృద్ధి సూచికలపై పర్యవేక్షణ
- ప్రతి రెండు, నాలుగో బుధవారాల్లో సమీక్షలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచికలను పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఎఎస్ అధికారులు ఇకపై క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. కీలక అంశాలపై బాధ్యతలను ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించిన ప్రభుత్వం వాటి అమలు తీరును పరిశీలించేందుకు కదలి వెళ్లాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులకు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ కూడా ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా నెలలో రెండుసార్లు ఒక సచివాలయం చొప్పున పర్యటించాలని నిర్దేశించారు. అక్కడి వారితో చర్చించి, అమలుపై నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆ నివేదికలను గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపించాల్సి ఉంటుంది. అనంతరం వాటిని నేరుగా ముఖ్యమంత్రి, సిఎస్ సమీక్షిస్తారు. ప్రతి నెలా రెండు, నాలుగో బుధవారాల్లో ఈ సమీక్షలు ఉంటాయి. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన సూచికల్లో గిరిజన, ఇతర ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, గోరుముద్ద, విద్య, హాస్టళ్లు వంటి వాటిపై ఐఎఎస్ అధికారులు అధ్యయనం చేసి, అమలును పర్యవేక్షించాల్సి ఉంటుంది.

నేడు విశాఖకు ప్రధాని మోడీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటన సందర్భంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు మధురై విమానాశ్రయంలో బయల్దేరి 7.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఐఎన్ఎస్ డేగాలోని చోళా సూట్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేయనున్నారు. ఎపి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 6.15 గంటలకు విశాఖకు చేరుకుని ఐఎన్ఎస్ డేగా వద్ద ప్రధానికి స్వాగతం పలకనున్నారు. రాత్రి పిఎంతో సిఎం సమావేశం అవుతారని తెలుస్తోంది. పోర్టు గెస్ట్ హౌస్‌లో సిఎం బసచేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు తూర్పు నౌకాదళం నుంచి ప్రధాని మోడీ నేరుగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌కు రోడ్డుమార్గంలో 10.30 గంటలకు చేరుకుంటారు. 15 నిమిషాల పాటు రూ.15,233 కోట్లతో ప్రధాని పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేయనున్నారు. వీటిలో రూ.7614 కోట్లతో ఐదు శంకుస్థాపనలు, రూ.7619 కోట్లతో నాలుగు ప్రారంభోత్సవాలు చేపడతారు. 12 గంటలకు ఎయు నుంచి ఐఎన్ఎస్ చోళాకు బయల్దేరి అక్కడ నుంచి ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టుకు 1.10 గంటలకు చేరుకోనున్నారు.

ఓవర్ డ్రాఫ్ట్‌లను వీడని ఖజానా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాను ఓవర్‌డ్రాఫ్ట్ భారం వదలడం లేదు. ఈ నెలలో తొలి తొమ్మిది రోజుల్లో వరుసగా వారం రోజులు ఓడీకి వెళ్లాల్సి రావడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రూ.2,209 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్లు తేలింది. రాష్ట్ర ఖజానాకు ఇతర రూపాల్లో జమయ్యే పన్నుల ఆదాయం వచ్చింది వచ్చినట్లుగా రిజర్వ్‌బ్యాంకుకు జమ అయిపోతోంది. నవంబర్ నెల్లో తొలుత రూ.1,848 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌తో ప్రారంభం కాగా, తరువాత నుంచి తగ్గడం మళ్లీ పెరగడంతోనే గడచిపోతోంది. ఈ వారం రోజుల్లో ఒక్క రోజు కూడా జీరో ఓవర్‌డ్రాఫ్ట్ నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి నెలా రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలం ప్రక్రియలో పాల్గొని రుణం తీసుకునే రాష్ట్ర ఆర్థికశాఖ ఈ నెల ఇంతవరకు ఆ వేలంలో పాల్గొనకుండా ఓడీతోనే నెట్టుకు రావడం మరో విశేషం.

వాయిదాల పద్ధతిలో 5 స్టార్ ఫ్యాన్లు, ఎసిలు

- డిస్కంలు, సిడ్కో ప్రతిపాదనకు ఎపిఇఆర్‌సి ఆమోదం
- విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాల్లో పైలట్ ప్రాజెక్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులకు ఇంధన సామర్థ్యంతో కూడిన స్టార్ రేటెడ్ పరికరాలను మార్కెట్ కంటే తక్కువ ధరకు అందించే ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆమోదం తెలిపింది. వడ్డీలేని నెలవారీ సులభ వాయిదాల పద్ధతిలో ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు, ఎల్ఇడి ట్యూబ్‌లైట్లను డిస్కంలు, సిడ్కో అందించనున్నాయి. ఈ అంశంపై ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డి డిస్కం, సిడ్కో అధికారులతో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన సామర్థ్య గృహోపకరణాల వినియోగంపై వినియోగదారుల్లో అవగాహన పెంచాలని, వీటివల్ల విద్యుత్ వినియోగం తగ్గి బిల్లులు కొంతమేర తగ్గుతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సైతం దోహదపడుతుందని తెలిపారు. సాంప్రదాయ లైట్లు, ఫ్యాన్లు వంటి వాటితో పోలిస్తే ఇంధన సామర్థ్యం ఉపకరణాల వాడకం వల్ల 25 నుంచి 30శాతం విద్యుత్ ఆదా అయ్యే అవకాశం ఉందన్నారు. 5 స్టార్ రేటెడ్ గృహోపకరణాలను వినియోగదారుల కోరిక మేరకు ఎపిసిడ్కో, డిస్కంలు సరఫరా చేయనున్నాయని తెలిపారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టును విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాల్లో అమలు చేయనున్నారు. పైలట్ ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని సిడ్కో, డిస్కంలకు సూచించారు. ఈ ప్రాజెక్టుల అమలుకు వివిధ వస్తు తయారీ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. ప్రాజెక్టు పూర్తయిన 45 రోజుల్లోగా ప్రాజెక్టు అమలుపై ఇఆర్‌సికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా నాగార్జున రెడ్డి విడుదల చేశారు. వెబినార్‌లో ఇఆర్‌సి సభ్యులు పి రాజా గోపాల్, రామసింగ్ ఠాకూర్, డిస్కంల సిఎండిలు జె పద్మజనార్ధనరెడ్డి, కె సంతోషరావు, ఇఆర్‌సి కార్యదర్శి రాజబాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం కనుసన్నల్లోనే మద్యం మాఫియా : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్, ఎంపి విజయసాయిరెడ్డి కనుసన్నల్లోనే రాష్ట్రంలో మద్యం మాఫియా నడుస్తోందని టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. పలుమార్లు వివిధ సంస్థలకు టిడిపి ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. కొత్తపాలసీ పేరుతో మూడున్నరేళ్లలో రూ.77 వేల కోట్ల మద్యం వ్యాపారం చేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో అంచెలంచెలుగా మద్యపాన నిషేధం అమలు చేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక అంచెలంచెలుగా మద్యం మాఫియాను పెంచి పోషించారని టిడిపి ప్రధాన కార్యదర్శి పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు.

వేమన కంటే వైఎస్ గొప్పవాడా? : నిమ్మల రామానాయుడు

ప్రజాకవి వేమన కంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గొప్పవాడా? అని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని తొలగించి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ప్రతిష్టించుకునే స్థాయికి సిఎం జగన్ దిగజారారని మండిపడ్డారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. మూఢ నమ్మకాలపై, కుల వివక్షపై గళమెత్తి, చైతన్యం తీసుకొచ్చిన గొప్ప కవి వేమన అని అన్నారు. తెలుగుజాతి యుగపురుషుల పేర్లు మార్చి సిఎం తన తండ్రి పేరు పెట్టుకుంటున్నారని, ఇలాగైతే, వైఎస్ఆర్ విగ్రహాలు తప్ప రాష్ట్రంలో ఇతరుల విగ్రహాలు కనిపించవని పేర్కొన్నారు.

ప్రభుత్వంపై టిడిపి, జనసేన కుట్రలు

- అరబిందో ఫార్మాతో విజయసాయికి సంబంధంలేదు
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత నెలరోజులుగా రాష్ట్రప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, జనసేనలు కలసి కుట్రలు చేస్తున్నాయని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఎక్కడ ఏమి జరిగినా ప్రభుత్వానికి ఆపాదించడం అలవాటుగా చేసుకున్నారని చెప్పారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. అరబిందో ఫార్మా కంపెనీకి విజయసాయిరెడ్డికి సంబంధం ఏమిటని, ఎవరో అరెస్టయితే అల్లుడు అరెస్టయినట్లు మాట్లాడటం తగదని అన్నారు. ఆ కంపెనీకి చెందిన శరత్‌చంద్రారెడ్డికి విజయసాయిరెడ్డికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆ కంపెనీ ఎప్పటి నుంచో వుందని, అందులో చంద్రబాబుకు భాగస్వామ్యం వుందని చెప్పారు. ప్రభుత్వానికి సంబంధంలేని చిన్న అంశాలను కూడా ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డికి అంటగట్టి మాట్లాడుతున్నారని అన్నారు. విశాఖ గర్జన రోజునే పవన్‌కల్యాణ్ అక్కడికి వచ్చి కావాలనే గందరగోళం సృష్టించారని చెప్పారు. ఇప్పటంలో ఎలాంటి కూల్చివేతలు లేకున్నా అనవసర రాద్ధాంతం చేశాయని అన్నారు. ఇప్పటంలో పవన్ కల్యాణ్ అంత ఆవేశం ఎందుకు ప్రదర్శించారో చెప్పాలన్నారు. నందిగామలో రాయితో దాడి చేశారని చంద్రబాబునాయుడు డ్రామా చేశారని అన్నారు. రోజూ ఏదో ఒక వివాదాన్ని వారే సృష్టించి ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

పాస్టర్లకు ఏ చట్టం ప్రకారం గౌరవ వేతనం చెల్లిస్తారు?

- ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ ధనంతో పాస్టర్లకు నెలవారీ గౌరవ వేతనం ఎలా చెల్లిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మతపరమైన అంశాల నిమిత్తం, మత వ్యవహారాల నిమిత్తం కొంత మొత్తాన్ని ప్రభుత్వాలు ఖర్చు చేయడం సమర్ధించవచ్చునని, పాస్టర్లకు ప్రతినెలా గౌరవ వేతనం ఏ చట్ట నిబంధన ప్రకారం చెల్లిస్తారో చెప్పాలని కోరింది. దీనిపై సమగ్ర వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసు జారీ చేసింది. ఈ మేరకు గురువారం చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ సోమయాజులతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జీవో 52 జారీ చేసింది. విజయవాడకు చెందిన అనిల్ కుమార్ హైకోర్టులో ఆ జిఒను సవాల్ చేస్తూ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రభుత్వ వాదనల నిమిత్తం విచారణ ఈ నెల 23కి వాయిదా పడింది.

డిసెంబర్ నాటికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యఖాతా నమోదు ప్రక్రియను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఆదేశించారు. రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ అధికారులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ఇకపై వైద్యసేవలు అందించే అంశంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లదే కీలకపాత్ర అవుతుందని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యఖాతా నమోదు ప్రక్రియ ఇప్పటికే 70శాతం పూర్తయిందని, మిగిలిన 30శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారం ప్రభుత్వం వద్ద వుండేలా సర్వే చేయాలన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్లతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. గర్భిణుల పట్ల మరింత జాగ్రతగా వ్యవహరించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్‌తో సమన్వయం చేసుకొని గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై దృష్టి సారించాలని, ఎనీమియాను నియంత్రించాలని అన్నారు. మానసిక సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం 14410 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో వుంటుందని చెప్పారు.

ఎపి రైతు సంఘం నుంచి జమలయ్య బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి పి.జమలయ్యను బహిష్కరించారు. వడ్డేశ్వరంలోని ఎపి రైతు సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షతన గురువారం ఆ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించింది. పి జమలయ్య ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వుంటూ సంఘ నిర్మాణానికి వ్యతిరేకంగా తీవ్రమైన అవినీతి, ఆర్థిక అరాచకాలకు పాల్పడినట్లు సమావేశం తీర్మానించింది. ఈ నేపథ్యంలో సంఘంలోని అన్ని బాధ్యతలతోపాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా బహిష్కరించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు మంత్రాపు సూర్యనారాయణ, కోశాధికారి వై కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు.



పరస్పరం వాదులు ఆడుకుంటున్న కార్యకర్తలు

సత్తెనపల్లిలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- ఇన్‌ఛార్జిని ప్రకటించాలని కోడెల శివరాం డిమాండ్

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి సర్వసభ్య సమావేశంలో పార్టీలో నెలకొన్న విబేధాలు బయటపడ్డాయి. సత్తెనపల్లిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ సంస్థాగత కమిటీల నియామకం గురువారం జరిగింది. పార్టీ పరిశీలకులుగా కొండపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయులు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు హాజరయ్యారు. పార్టీ పట్టణ, మండల కమిటీల ఎంపికపై కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటుండగా కోడెల శివరాం అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌ని ప్రకటించకుండా మండల, పట్టణ కమిటీలను ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. కమిటీల నియామకం విషయంలో కోడెల శివరాం, మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు మధ్య విభేదాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాల కార్యకర్తలు ఒకదశలో ఘర్షణ పడ్డారు. కుర్చీలు విసురుకున్నారు. ముష్టిఘాతానికి పాల్పడ్డారు. దీంతో సమావేశంలో తీవ్రగందరగోళం తలెత్తింది. వై.వి.ఆంజనేయులు కమిటీ సమావేశం నుంచి నిష్క్రమించారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌ని ప్రకటించిన తరువాతనే కమిటీలను ప్రకటించాలని శివరాం డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు తెలిపారు.



సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న కొమ్మినేని

ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేని బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ మొగల్రాజపురంలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెన్నుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాణిక్య వరప్రసాద్, రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ టి విజయకుమార్‌రెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు, తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, నగర అధ్యక్షుడు కలిమిశ్రీ, ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు వి శ్రీనివాస్, కె మునిరాజు, పలువురు సీనియర్ జర్నలిస్టులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. క్యాబినెట్ హోదా వుండే ఈ పదవిలో కొమ్మినేని శ్రీనివాసరావు రెండేళ్లు కొనసాగనున్నారు.

సిఎంకు కొమ్మినేని కృతజ్ఞతలు

బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు సిఎం జగన్‌ను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. చిత్తశుద్ధితో ప్రెస్ అకాడమీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నిబంధనలన్నీ పాటిస్తున్నాం..

- గవర్నర్‌తో విద్యాశాఖ మంత్రి సబిత భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్‌భవన్ - ప్రగతిభవన్ మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా మారిన అంశంపై గవర్నర్ తమిళిసైకు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రాజ్‌భవన్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం గవర్నర్‌తో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయాల్లో ఉమ్మడి నియామక బోర్డుకు సంబంధించి గవర్నర్‌కు ఉన్న సందేహాలన్నింటిని అధికారులు నివృత్తి చేశారు. సుమారు 45 నిమిషాలు జరిగిన సమావేశంలో బోర్డు ఆవశ్యకత, యుజిసి నిబంధనలు, న్యాయపరమైన చిక్కులపై గవర్నర్ ఆరా తీశారు. విశ్వవిద్యాలయాల్లో ఉమ్మడి నియామక బోర్డు ద్వారా నియామకాలు త్వరగా జరగాలన్నదే తన అభిమతమని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు రాకూడదన్నదే తన విధానమని వెల్లడించారు. నిబంధనలన్నిటినీ పూర్తి స్థాయిలో పాటిస్తున్నామనీ, ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని మంత్రి సబితా తెలిపారు. ప్రస్తుత విధానంలోని ఇబ్బందుల గురించి అధికారులు గవర్నర్‌కు వివరించారు. కొత్త విధానం అమలు ద్వారా కలిగే సౌలభ్యం గురించి కూడా వివరణ ఇచ్చారు. మంత్రి వెంట విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆర్.లింబాద్రి తదితరులు ఉన్నారు.

వాణిజ్య గ్యాస్‌పై రాయితీ ఎత్తివేత

హైదరాబాద్ : ఎల్‌పిజి వాణిజ్య సిలిండర్లపై డిస్ట్రిబ్యూటర్లు ఇస్తున్న రాయితీలకు మంగళం పాడాలని చమురు కంపెనీలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, స్ట్రీట్ వెండర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై భారం పడనుంది. చమురు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై రాయితీని ఎత్తివేస్తూ చమురు కంపెనీలు నవంబర్ 7న మధ్యరాత్రి నిర్ణయం తీసుకున్నాయి. మంగళవారం నుంచి ఇది అమల్లోకి వచ్చిందని తమకు సమాచారం ఇచ్చారని తెలంగాణ ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ (టిఎల్‌డిఎ) అధ్యక్షుడు కె జగన్ మోహన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జువ్వడి శ్రీ చరన్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. పంపిణీదారులకు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే చమురు కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయన్నారు. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1945గా ఉందన్నారు. ఇది వరకు వినియోగదారుల వాడకం స్థాయి, నగదును బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు రాయితీ ఇచ్చే వారమని తెలిపారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదన్నారు. హైదరాబాద్‌లో నెలకు 8 లక్షల వాణిజ్య సిలిండర్ల వాడకం ఉందన్నారు.

సెయిల్‌లో విలీనం.. మరో జిమ్మిక్కు!

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి వచ్చే ఏడాది వరకు ఆగడం దేనికంటూ అడుగుతున్న ప్రశ్నకు జవాబురావడం లేదు. దీంతో ప్రస్తుత నిరసనలను పక్కదోవ పట్టించేందుకే ఈ తరహా ప్రచారం జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సెయిల్‌లో కలపడం విశాఖ ఉక్కుకు ఎంతమేరకు మేలు చేకూరుస్తుందన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. సెయిల్‌కు సొంత గనులున్నాయని, ఆ గనుల ప్రయోజనం విశాఖ ఉక్కుకు కూడా లభిస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఇది కొంతమేరకు నిజమే అయినా, ఇప్పటికే వాటి ఉత్పత్తిని సెయిల్ వినియోగిస్తోంది. అదనపు ఉత్పత్తి సాధ్యమవుతుందా అన్న విషయంలో స్పష్టత లేదు. అదే విధంగా సెయిల్ విశాఖ ఉక్కు మాదిరి నూరు శాతం ప్రభుత్వ రంగ సంస్థ కాదు. దానిలో ఇప్పటికే 35 శాతం వాటాలను విక్రయించారు. సెయిల్‌లో విలీనం తరువాత విశాఖ ఉక్కులో కూడా ఆ దామాషా సూత్రమే వర్తిస్తుంది. అంటే, దశలవారీ ప్రైవేటీకరణకు తెరతీయడం! ఈ విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే బిజెపి నాయకులు చెప్పడం లేదు. 'బండ్లింగ్' విధానంలో విలీనం జరుగుతుందని చెబుతున్నారు. విలీన ప్రక్రియ కోసం సెయిల్‌కు కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు ఇవ్వడం లేదు. ఆ సంస్థకున్న ఆదాయం నుండో, అప్పుచేసో విలీన ప్రక్రియను పూర్తిచేయాల్సిఉంటుంది. మరోవైపు స్టీల్ ప్లాంటు ఆస్తుల విలువను గణనీయంగా తగ్గించి చూపుతున్న సంగతి తెలిసిందే. దీంతో సెయిల్ చేసిన రుణబారం అందులో విలీనమైన విశాఖ ఉక్కు మీద కూడా పడుతుంది. ఈ అప్పులను సాకుగా చూపి, రెంటిని గుంపగుత్తుగా అదానికో, పోస్కోకో కట్టబెట్టడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో విశాఖ ఉక్కు తీసుకున్న రుణాన్ని కేంద్ర ప్రభుత్వం డివిడెండ్‌గా మార్చడానికి ఏళ్ల తరబడి సమయం తీసుకున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు ఆరు నెలల క్రితం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖతోనూ స్టీల్ ప్లాంట్‌పై ఢిల్లీలో జరిపిన చర్చల్లో సెయిల్ అంశం కూడా చర్చకు రాగా 'అలాంటి ప్రత్యామ్నాయం ఏమీ లేదు. సెయిల్‌లో కలపం.. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులూ ఇవ్వం. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తాం..లేదంటే మూసేస్తాం.. ఇదే మా విధానం. లాభ నష్టాలతో సంబంధం లేదు' అని ప్రభుత్వం చెప్పింది. ఈ విషయాన్ని సిహెచ్.నర్సింగరావు తాజాగా విశాఖలో మీడియాకు వెల్లడించడం గమనార్హం.

రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడి ప్రశ్నిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వత్తాను పలకడమే కారణమన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ అన్నారు, ఆ మాటే మరిచారని తెలిపారు. రామాయపట్నం పోర్టు అతీగతి లేకుండా ఉందని, గిరిజన యునివర్శిటీలో చదువుచెప్పేందుకు అధ్యాపకులను నియమించలేదని తెలిపారు. ఇదంతా రాష్ట్రాన్ని విధ్వంసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ప్రజల చీత్కారాలకు గురై ద్వేషించబడే బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పోటీపడి మద్దతు తెలుపుతున్నాయన్నారు. రాష్ట్ర హక్కుల కోసం, విభజన హామీల కోసం, విశాఖపట్నం స్టీలు ప్లాంటును కాపాడుకోవడం కోసం, ప్రత్యేక హోదా కోసం బహిరంగ సభలో ప్రధాన మంత్రికి అప్పీలు చేయాలన్నారు. ప్రధాని చెప్పే సమాధానాన్ని బట్టి ప్రజలు ఒక నిర్ణయానికి వస్తారని తెలిపారు. రాజధాని అంశంపై మాట్లాడుతూ...ఏకైక రాజధాని విశాఖ అంటూ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వాఖ్యలు ప్రజల మనోభావాలతో చెలగాటమాడటమేనన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అజెండాలను పక్కదారి పట్టించేందుకు, ఘర్షణలు పెంచి విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అమరావతి ఏకైక రాజధానిగా గతంలో అంగీకరించారని గుర్తు చేశారు. విశాఖను అభివృద్ధి చేయాలంటే స్టీలు ప్లాంటును కాపాడాలని కోరారు. సుజల స్రవంతి రాకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి. అరుణ్ పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్తు కోసమే

- బిజెపి కుట్రలను తిప్పికొడతాం
- 'ప్రజాశక్తి' ఇంటర్వ్యూలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు ఉద్ఘాటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజల భవిష్యత్తు కోసమే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని పోరాడుతున్నామని ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు చెప్పారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటన నేపథ్యంలో పోరాట కమిటీ నేతలు జె.అయోధ్యరామ్ (సిఐటియు), డి.ఆదినారాయణ (ఎఐటియుసి), మంత్రి రాజశేఖర్ (ఐఎన్‌టియుసి) ప్రజాశక్తితో మాట్లాడారు. విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించే విశాఖ స్టీల్ ప్లాంటును ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని వారు తెలిపారు. ప్లాంటును ప్రైవేటుకు తెగనమ్మాలనే కేంద్ర ప్రభుత్వ, బిజెపి కుట్రలను ప్రజా సహకారంతో తిప్పికొడతామని చెప్పారు. 635 రోజులుగా సాగుతున్న విశాఖ ఉక్కు ఉద్యమానికి రాష్ట్రంలోని ప్రజలందరి మద్దతు లభిస్తోందని అన్నారు.

ప్రధాని ప్రకటన చేయాలి



ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే బహిరంగసభలో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటన చేయాలని స్టీల్ ప్లాంట్ గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షులు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆ ప్రకటన చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేసి, రాష్ట్రాన్ని అట్టుడికిస్తామని ఆయన చెప్పారు. రెండేళ్ల క్రితమే ప్రధాన మంత్రి మోడీ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తామని రోడ్లు వేసి, ఇతర మౌలిక వసతుల కోసం రూ.100 కోట్లు ఖర్చుపెట్టారని, ఇప్పుడు ప్లాంటును అమ్మడానికి పెట్టడం దుర్మార్గపు చర్యని అన్నారు. 'అదానీకి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కట్టబెట్టే చర్యల్లో భాగంగానే రాయపూర్ నుంచి విశాఖపట్నంకు 6 లేన్ల రోడ్డును మోడీ వేయిస్తున్నారు. దీనివల్ల ఉపాధి ఎవరికైనా లభిస్తుందా? ఎవరికి దోచుకుంటుంది? విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి 8 మిలియన్ టన్నులు ఉన్నదాన్ని 20 మిలియన్ టన్నులు చేస్తే కోటి మందికి ఉపాధి లభిస్తుంది. ఇదంతా ఈ ప్రాంతానికి మేలు కలిగిస్తుంది.' అని ఆయన చెప్పారు.

పోరాటాల ద్వారానే నిలబెట్టుకుంటాం



'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దేశానికే గర్వకారణమైన కర్మాగారం. అనేక పోరాటాలు చేసే దీన్ని సాధించుకోవడం జరిగింది. పోరాటాలతోనే నిలబెట్టుకుంటాం' అని ఐఎన్‌టియుసి స్టీల్‌ప్లాంట్ గౌరవాధ్యక్షులు మంత్రి రాజశేఖర్ అన్నారు. 'గతంలో యుపిఎ హయాంలోనూ స్టీల్‌ప్లాంట్‌కు ప్రమాదం వచ్చినప్పుడు పోరాడి నిలుపుకున్నాం. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నుంచి స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు సాగించడం పెరిగింది. బరితెగించేలా వ్యవహరిస్తోంది.' అని చెప్పారు. 'స్టీల్‌ప్లాంట్ భూములు, మౌలిక వసతులను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానం కేంద్రం తీసుకుంది. ప్రభుత్వ రంగం పునాదులకే బిజెపి ప్రమాదం తెచ్చిపెడుతోంది. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయడం అంటే భారత రాజ్యాంగంపైనా దాడులు చేయడమే అవుతుంది. అన్ని తరగతులూ ఏకమై దీనిని ఎదిరించాలి.' అని అన్నారు. 'స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలి లేకపోతే జరిగే పరిణామాలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

రూ.3 లక్షల కోట్ల ప్లాంటును 30 వేల కోట్లకా ?



రూ 3 లక్షల కోట్ల ఆస్తులున్న స్టీలు ప్లాంటును 30 వేల కోట్ల రూపాయలకు అదానీకో, అంబానీకో తెగనమ్మడానికి కేంద్రం కుట్ర చేస్తోందని విశాఖ ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ జె. అయోధ్య రామ్ అన్నారు. ఇది సమర్థనీయమా అని ఆయన ప్రశ్నించారు. 'ప్లాంట్ సాధన కోసం 32 మంది ప్రాణ త్యాగం చేశారు. 16వేల మంది భూములు కోల్పోయారు. దీనిని ప్రైవేటుకిస్తే వారి త్యాగం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. కార్మికులు సంపదను సృష్టించారు. వీటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్లాంటు అమ్మకాన్ని ఆపుతున్నట్లు ప్రధాని ప్రకటించేవరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.' అని ఆయన అన్నారు. 'విశాఖకు రైల్వే జోన్ వస్తుందని బిజెపి నేతలు చెప్పారు. ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్ను ఎత్తేశారు? స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారు. ఇప్పుడేమో రాయపూర్ నుంచి విశాఖపట్నానికి ఆరు లేన్ల రోడ్డు వేస్తున్నట్లు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖలో అభివృద్ధి చేయాలనుకుంటే డివిజను ఎత్తేయడం ఏ సమాధానం? ఎవరి కోసం రాయపూర్ లైన్ రోడ్డు వేస్తున్నారు? రోడ్డు వేసి ఉన్న ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను అమ్మేస్తారా? రాయపూర్ నుంచి రోడ్డు వేసి స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మేసేందుకు 'మార్గం సుగమం' చేస్తారా?' అని ప్రశ్నించారు. తక్షణం ఈ విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఈ నెల 12న దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎయు (గ్రౌండ్) నుంచి ప్రసంగిస్తున్నారు. ప్రధానితోనే ముఖ్యమంత్రి స్టీల్ ప్లాంటు అమ్మకాన్ని ఆపేలా ప్రకటన చేయించాలి' అని అన్నారు.

అన్ని విధాలుగా నష్టం చేస్తున్నారు

వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్రానికి అన్ని విధాల నష్టం చేస్తున్నారని రైతునాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆయన మోడీ విభజన హామీలను అమలు చేయలేదని, రైల్వేజోన్ ఇవ్వలేదని, విశాఖ స్టీల్ ప్లాంటును అమ్మకానికి పెట్టారని అన్నారు. రాష్ట్రానికి ఇంతగా నష్టం చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపిని ఎందుకు మోస్తున్నాయో అర్థం కావడం లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కీలకమైన రైల్వేజోన్‌ను ఇంతవరకు ఏర్పాటు చేయలేదని, పూటకోమాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ఎంతోమంది త్యాగాలతో ఏర్పడి రాష్ట్రంలోనే అతిపెద్ద స్టీలుప్లాంటుగా ఉన్న విశాఖ ఉక్కుకర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తుంటే పాలకులుగానీ, ప్రతిపక్షంలో ఉన్న టిడిపిగానీ కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని అన్నారు. విభజన హామీలో పేర్కొన్న ఒక్క అంశాన్ని అమలు చేశామని చెప్పుకునే పరిస్థితిలో కేంద్రం లేదన్నారు. దీనిని ప్రశ్నించకుండా వైసిపి, టిడిపి నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వైపునుండి కనీస డిమాండ్ కూడా పెట్టలేకపోవడం బాధాకరమని అన్నారు. ఇంతటి దురదృష్టం మరొకటి లేదని చెప్పారు. రైతాంగాన్ని, ప్రజలపైనా భారాలు మోపే ఎలక్ట్రిసిటీ 2022 బిల్లు కు రాష్ట్రం నుండి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు పార్టీల నాయకులూ మద్దతు తెలిపారని అన్నారు. దీనివల్ల పేద రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడనున్నారని వివరించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ప్రధాని గుజరాత్‌కు పెట్టుబడుల వరద కురిపిస్తున్నారని, పరిశ్రమలకు, ప్రాథమికోత్పత్తులకు వేలకోట్ల రాయితీలు, లక్షల కోట్లు అప్పులు ఇస్తున్నారని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రంలో రామాయపట్నం పోర్టు, కడప స్టీలు ఫ్యాక్టరీలకు అతీగతీ లేదని అన్నారు. దీనికి అప్పట్లో చంద్ర బాబు, ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారని, అయినా కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేకపోవడంతో ఒక్క అడుగూ ముందుకు పడలేదని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ మానుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారాలి
మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే చర్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రైవేటీకరణకు బదులుగా ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సమర్థులైన యాజమాన్యాన్ని నియమించి, పూర్తి సామర్థ్యంతో అన్ని బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిచేలా కేంద్రం ఆర్థిక సాయం చేయాలన్నారు. ప్లాంట్ సామర్థ్యాన్ని మూడు మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు కార్మికులు పెంచిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని మూడు ఫర్నేస్‌లలో ఒకటి మాత్రమే పూర్తి సామర్థ్యంతో పనిచేయిస్తున్నారని, మిగతా రెండింటిలో ఒకటి పాక్షికంగా, మరొకటి మూసివేశారని తెలిపారు. దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ మూసివేత ఫలితంగా ప్లాంట్ తన సామర్థ్యంలో మూడోవంతు మాత్రమే పనిచేస్తోందన్నారు. 20.63 మిలియన్ టన్నుల ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్లాంట్ కలిగి ఉందన్నారు. 2030-31 నాటికి దీన్ని 35 మిలియన్ టన్నులకు పెంచాలన్న లక్ష్యం ఉందని, దీనికి పెట్టుబడి రూ.లక్ష కోట్ల వరకూ ఉండొచ్చని సెయిల్ సూచించిందని తెలిపారు. ఏడాదికి పైగా ఉక్కు కార్మికులు అకుంఠిత దీక్షతో చేస్తున్న ఉద్యమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసే పనులు ఇకనైనా మానుకోవాలన్నారు.

గంగవరం పోర్టును వదిలేశారా?

విశాఖ స్టీల్ ప్లాంటు దేశంలోనే సముద్రతీరంలో ఉన్న ఏకైక ఉక్కు పరిశ్రమ అని, అటువంటి ప్లాంటుకు పనిలేకుండా ఉంచడం తీవ్రంగా పరిగణించాలని అన్నారు. వర్కింగ్ క్యాపిటల్, క్యాప్టివ్ మైనింగ్ అన్నది రెండు సమస్యలను నేడు స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటోంద న్నారు.

గంగవరం పోర్టును ఆదానీకి రాష్ట్ర ప్రభుత్వ తన 11శాతం వాటాను వదిలిపెట్టడానికీ, నేడు స్టీల్‌ప్లాంట్‌ను అదే కార్పొరేట్‌కి కట్టబెట్టడానికి ఉన్న లింకు ఇప్పుడు అర్థమవుతోందని తెలిపారు. ప్లాంట్‌లోని స్థలంలో అత్యంత భారీ రాయితీ ధరకి ఓ ప్రైవేట్ గ్రూప్‌నకు అప్పట్లో కట్టబెట్టేశారని చెప్పారు. ప్రైవేటు సంస్థలకు లాభం చేకూర్చే ఈ తరహా విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలన్నారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీకి ఘన స్వాగతం తగదు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఘనస్వాగతం పలకడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, రైల్వేజోన్, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా మోసం చేశారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టే నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రానికి మోడీ తీరని ద్రోహం చేస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలకడం సరైంది కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి కేసుల నుండి బయట పడేందుకు మోడీ ముందు మోకరిల్లుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మోసం చేసిన నరేంద్రమోడీ పర్యటనను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసనల్లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వేమన విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి

కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయంలోని వేమన విగ్రహం స్థానంలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టడం తగదని, తక్షణం అదే స్థానంలో వేమన విగ్రహాన్ని పునఃప్రతిష్ట చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. విగ్రహాలు తొలగించడం, యూనివర్శిటీల పేర్లు మార్చడం తప్ప సిఎంకు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు.

'ఉక్కు' ప్రజల సంపద

ప్రైవేటీకరించే హక్కు మోడీకి లేదు • రాజకీయ పార్టీల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, వాల్తేరు రైల్వే డివిజన్ తరలింపు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలంటూ సిపిఎం, సిపిఐ, తెలుగు దేశం, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) కాంగ్రెస్, ఆప్, లోక్‌సత్తా, ఎంసిపిఐ పార్టీల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సభ నిర్వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కమిటీ అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కె.లోకనాథం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్య నారాయణమూర్తి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గండి కనకరాజు, ఆప్ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ సీతల్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు జి.గోవింద రావు, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, లోక్‌సత్తా జిల్లా నాయకులు సుధీర్‌కుమార్ మాట్లాడారు. త్యాగాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపద అని తెలిపారు. ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ప్రారంభించని మోడీకి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు లేదన్నారు. విశాఖకు వస్తున్న ప్రధాని చేత స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రకటన చేయించాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిచేలా చూడాలని కోరారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, వాల్తేరు రైల్వే డివిజన్ తరలింపును ఆపాలని డిమాండ్ చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఫంక్షనింగ్‌ను ఎప్పటిలోగా జరిపిస్తారో మోడీ స్పష్టంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, ఆప్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని మోడీ ప్రకటించాలి: సిహెచ్ నరసింగరావు




ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ నెల 12న జరిగే బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన గురువారం ... అట్టుడికిపోయిందని, మూడుసార్లు సమ్మెలు, రెండుసార్లు బంద్‌లు జరిగాయని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆశలను మోడీ పరిగణలోకి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇచ్చి వంద శాతం సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరించడానికి స్టీల్‌ప్లాంట్ మోడీ సొంత సొత్తు కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ప్రకటన చేయకపోతే ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని తెలిపారు. ఎపి విభజన హామీలు, ప్రత్యేక హోదా సహా ఉత్తరాంధ్రకు చెందిన పలు ప్రాజెక్టులను ఇంతవరకూ అమలు చేయలేదని, విశాఖ సభలో వీటిపైనా మోడీ స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్లు ఎం.ఆదినారాయణ, ఎం రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వల్లే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని గుర్తు చేశారు.

చట్టం అమలుకానందునే నష్టం

వైసిపి, టిడిపిలదే బాధ్యత : ఉండవల్లి



రాష్ట్ర విభజన కంటే విభజన చట్టం అమలు కానందువల్లే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ చట్టం అమలుకు ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షపార్టీలు పెదవి విప్పడం లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లపాటు ప్రత్యేకహోదా ఇస్తామని చెబితే, పదేళ్ల పాటు ఇవ్వాలని, తాము అధికారంలోకి వస్తే ఆమేరకు అమలు చేస్తామని పార్లమెంటు సాక్షిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిజెపి మేనిఫెస్టోలో సైతం ఈ అంశం పెట్టారని తెలిపారు. 2014లో చంద్రబాబు నాయుడు సైతం 15 సంవత్సరాలు ఇవ్వాలని కోరినట్లు చెప్పారని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలన్నీ విస్మరించిందని అన్నారు. స్పెషల్ స్టేటస్ బదులు ప్యాకేజీ అని చెబుతూ గత ప్రభుత్వం కాలం వెల్లదీసిందన్నారు. రాష్ట్రానికి జీవనాడి, బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని చట్టంలో చెప్పారన్నారు. దానిని సైతం బిజెపి ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. ఆ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లను త్యాగం చేసిన సర్వం కోల్పోయిన నిర్వాసితులకు రావాల్సిన నిధులు కేటాయింపులు చేయలేదని తెలిపారు. విశాఖకు రైల్వే జోన్ ఇస్తామన్న నాయకులు ఇప్పుడు ఆ ప్రస్తావనే తేవట్లేదన్నారు. పార్లమెంటులో చేసిన చట్టాన్ని అమలు చేయించుకోలేని పరిస్థితుల్లో గత టిడిపి , ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ప్రధాని మోడీ విశాఖపట్నం రాక నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాలుగా గౌరవం చేసేందుకు సంసిద్ధమవుతుందని తెలిపారు. అయితే రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన పోలవరం, ప్రత్యేక హోదా గురించి ప్రశ్నించే పరిస్థితి కన్పించడంలేదని అన్నారు. దీనికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండు పార్టీలూ బాధ్యత వహించాలన్నారు.

సంపాదకీయం


రాజ్‌భవన్ రాజకీయం

ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలు తమ పాలనా విధులను నిర్వర్తించనీయకుండా గవర్నర్ల ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వానికి తగదు. ఇతర పార్టీల తరఫున ఎన్నికైన ఎంఎల్‌ఎలను బిజెపికి అనుకూలంగా ఫిరాయింపజేసి, గవర్నర్ల ద్వారా కమలం పార్టీ ప్రభుత్వాలనేర్పాటు చేయించిన సందర్భాలనేకం. ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలకు అడ్డంకులు కల్పించి ఒకవైపు పాలన సాగనీయకుండా చేయడం మరోవైపున రాజ్యాంగపరమైన ప్రతిష్టంభన ఏర్పడబోతోందన్న గందరగోళాన్ని సృష్టించడం తాజా చర్చనీయాంశంగా ఉంది. కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు తలనొప్పులు తెప్పిస్తున్నారు. విద్యారంగానికి సంబంధించిన సమస్యల చుట్టూనే ఈ వివాదాలు సృష్టించడం గమనార్హం. గవర్నర్ల దుశ్చర్యలను ఆ ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామికంగా ఎదుర్కొంటుండడం స్వాగతించదగినది.

విద్య విషయంలో కేరళ రాష్ట్రం దేశానికే ఆదర్శం. విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్ ఆ రాష్ట్ర ఉన్నత విద్యారంగంలో గందరగోళం సృష్టించడానికి, సంఘపరివార్ అనుయాయులను వైస్‌ఛాన్సలర్లుగా నియమించడానికీ విఫల యత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ స్థానంలో ఉన్నత అర్హతలున్న విద్యారంగ నిపుణులను ఛాన్సలర్లుగా నియమించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్డినెన్స్‌ను రూపొందించి గవర్నర్ ఆమోదానికి పంపారు. రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలు నిర్వహించే గవర్నర్ విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్లుగా ఉండటం సబబుకాదని జస్టిస్ పూంచ్ కమిటీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఛాన్సలర్ల బాధ్యతలను గవర్నర్ల నుండి తప్పించాలని కూడా అభిప్రాయపడింది. విద్యారంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూంచ్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఛాన్సలర్లగా విద్యారంగ నిపుణులను నియమించాలని నిర్ణయించడం సబబే. గవర్నర్ తన రాజ్యాంగ బాధ్యతలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌పై సంతకం చేస్తారని పలువురు ఆశిస్తారు. కానీ రాష్ట్ర మంత్రులపై వ్యక్తిగతంగానూ ప్రభుత్వంపైనా తీవ్ర పదజాలంతో అవాకులు చవాకులు మాట్లాడిన వ్యక్తి రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తారా అన్నది ఇంకొందరి సందేహం. మరోవైపున విచారణ పూర్తయ్యే వరకూ వైస్ ఛాన్సలర్లకు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోవద్దంటూ గవర్నర్ ను కేరళ హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఆయన ఇప్పుడైనా రాజ్యాంగం ప్రకారం, హైకోర్టు ఆదేశాలకు తగినట్టుగానూ నడుచుకోవాలి.

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు విషయంలో తనకు సందేహాలున్నాయంటూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సరికొత్త వివాదం రేపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలకు లోబడే ఆ బిల్లును రూపొందించినట్టు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. యుజిసితోపాటు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) వంటి సంస్థల మార్గదర్శకాలను పాటిస్తామని ఆ బిల్లులో పొందుపర్చారు. నిజానికి బీహార్, జార్ఖండ్‌ల్లో విశ్వవిద్యాలయాల నియామకాలకు బోర్డు ఎప్పటి నుంచో పనిచేస్తోంది. ఒడిశాలో వర్సిటీ సిబ్బందిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు నియామక ప్రక్రియలున్నాయి. అయినా తమిళిసై బిల్లును అడ్డుకున్నారంటే ఏదో కిరికిరి పెట్టాలనే కదా! తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 20 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రవి ఆమోదం తెలపకుండా అడ్డుకున్నారు. నీట్‌తో సంబంధం లేకుండా ఎంబిబిఎస్ ప్రవేశాలు కల్పించాలన్నది వాటిలో ఒకటి. ప్రజలెన్నుకున్న శాసనసభ ఆమోదించిన బిల్లులకు మోకాలొడ్డి, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పని చేయకుండా నిరోధిస్తున్న ఆయనను గవర్నర్‌గా తొలగించాలంటూ తమిళనాడు చట్టసభల సభ్యులు రాష్ట్రపతికి విన్నవించారు. రాజ్‌భవన్ ద్వారా రాజకీయాలు నడిపే విధానాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం విడనాడాలి. వారందుకు సిద్ధపడకపోతే భారత రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజాతంత్రవాదులూ ఒత్తిడి పెంచాలి, ఉద్యమించాలి.

మహనీయుల మాట



మన భావాలు మాటల వరకే పరిమితం కాకూడదు. వాటిని ఆచరణలో పెడితేనే ఫలితాలు సిద్ధిస్తాయి.

- ఫ్లోరెన్స్ నైటింగేల్

Florence Nightingale

వెనుకబడిన ప్రాంతాలకు బిజెపి ద్రోహం

సందర్భం

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని గర్జించి ...నాటి పాలకులపై పోరాడి ఉక్కు పరిశ్రమను సాధించుకున్న గడ్డపై... ఆ నినాదానికి కేంద్ర స్థానమైన విశాఖ నగరంపై ప్రధానమంత్రి కాలు మోపడాన్ని ఆంధ్ర ప్రజలు హర్షించరు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిన కేంద్ర పాలకులకు రాష్ట్ర పాలకులు స్వాగత ఏర్పాట్లు చేయడం విడ్డూరం. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా ఎనిమిది సంవత్సరాలుగా మోసం చేస్తున్న కేంద్ర సర్కారును రాష్ట్ర ప్రజల తరఫున నిలదీసి హక్కులు సాధించుకోవలసిన పాలకులు...మోడీ ముందు మరింతగా మోకరిల్లడానికి సకల ఏర్పాట్లు చేస్తూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి తలవంపులు తెస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2014లో సెక్షన్ 46(2) ప్రకారం "రాష్ట్రం లోని వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రయోజనాలు మరియు ప్రోత్సాహకాలను అభివృద్ధి ప్యాకేజీ రూపంలో ఇవ్వాలి." సెక్షన్ 46(3)లో "కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీని పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రత్యేకించి రాయలసీమ మరియు ఉత్తర కోస్తా జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తుంది" అని పేర్కొన్నారు.

అలాగే "రాయలసీమ జిల్లాలు మరియు ఉత్తర కోస్తా ఆంధ్రా అభివృద్ధికి ప్యాకేజి కె.బి.కె (కోరాపుట్, బోలాంగిరి, కలహండి), బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజి ఇస్తున్నాము" అని 2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధానమంత్రి ప్రకటించారు. బుందేల్‌ఖండ్‌కు 9 వేల కోట్లు, కె.బి.కె ప్యాకేజి కింద 15 వేల కోట్ల ప్రత్యేక సహాయాన్ని ఈ ప్రాంతాలకు ఇచ్చారు. అలాంటి సహాయం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇస్తామన్నారు.




వి. రాంభూపాల్

ఈ చట్టాన్ని, నాటి ప్రధాని ప్రకటనను బిజెపి బలపరచడమే కాకుండా ఆంధ్రకు ప్రత్యేక హోదా కాల పరిమితి ఐదేళ్ళు కాదు...పదేళ్ళు కావాలని పోరాడి సాధించామని చెప్పుకున్నారు. 2016 సెప్టెంబర్ 7న నాటి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజి ప్రకటించారు. 2018 ఫిబ్రవరి 1న ఇదే ఆర్థికమంత్రి రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిలువునా ముంచారు. నాటి నుండి బిజెపి నాయకులు అనేక మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలు చేస్తూ చివరకు హోదా లేదు పొమ్మన్నారు.

రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబాటు

రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో రాయలసీమలో నాలుగు, ఉత్తరాంధ్రలో మూడు మొత్తం ఏడు జిల్లాలు అత్యంత వెనుకబడిన జిల్లాలు. 13 జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా తలసరి ఆదాయంలో 13వ స్థానంలో, విజయనగరం 12వ స్థానంలో వుండగా, అనంతపురం 11వ స్థానంలో, కర్నూలు 10వ స్థానంలో, చిత్తూరు 9వ స్థానంలో, కడప జిల్లా 7వ స్థానంలో వున్నాయి (ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం కూడా ఈ తరహా వెనుకబడినదే). ఈ జిల్లాల్లో వస్తున్న ఆదాయంలో వ్యవసాయం, పరిశ్రమల వాటా చూస్తే వెనుకబాటు ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుంది. 2012-13 లెక్కల ప్రకారం వ్యవసాయం ద్వారా శ్రీకాకుళం 24.70 శాతం, విజయనగరం 26.53 శాతం, విశాఖ 9.63, చిత్తూరు 23.89, అనంతపురం 25.18, కర్నూలు 26.10 శాతం ఆదాయం రాగా, పారిశ్రామిక రంగంలో వరుసగా 20.14, 19.21, 34.96, 26.48, 28.28, 23.47, 23. 63 శాతంగా వుంది. అంటే ఈ జిల్లాల మొత్తం ఆదాయంలో వ్యవసాయం, పరిశ్రమల వాటా కలిపినా సగటున 50 శాతానికి మించి లేదు. ఈ జిల్లాల్లో సాగు అవుతున్న వ్యవసాయ భూమికి అతి తక్కువ సాగునీటి వనరులు వున్నాయి. ఉదాహరణకు కర్నూలులో 27.69 శాతం భూమికి సాగునీటి వనరులు వుండగా, అనంతపురం జిల్లాలో కేవలం 14.61 శాతంగా వుంది. ఇందులో కూడా రైతులు అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న బోర్ల వ్యవసాయానిదే అధికభాగం.

రాష్ట్ర విభజన చట్ట ప్రకారం అమలు చేయాల్సిన హామీలను... అమలు చేయకుండా, రాజధాని లాంటి అంశాల్లో బిజెపి అవకాశవాదంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల మధ్య దోబూచులాడుతూ రాష్ట్ర ప్రజలను ముంచేస్తున్నది. రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇవ్వకపోగా...విద్యుత్ మీటర్లు బిగించడం, ఓడరేవులు, రోడ్లు, గనులు, ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణ లాంటి విధానాలను వేగంగా అమలు జరుపుకుంటోంది.



ఈ పరిస్థితుల్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధించడం ద్వారానే రాష్ట్ర పురోభివృద్ధి, ఐక్యత సాధ్యమవుతుంది. అందుకే రాష్ట్ర విభజన చర్చ సందర్భంగా 2010 డిసెంబర్ 31న కేంద్రప్రభుత్వానికి నివేదిక సమర్పించిన శ్రీకృష్ణ కమిషన్ "హైదరాబాద్ చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించబడడం ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర తీవ్రంగా వెనుకబడ్డాయని" చెప్పింది. దీనికి రాష్ట్ర విభజన పరిష్కారం కాదు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి విధానాలు అనుసరించాలని సూచించింది. అయినా రాష్ట్ర విభజన జరిగిపోయింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజిపై పాలకులు హామీ ఇవ్వాల్సి వచ్చింది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి
భిక్ష కాదు, హక్కు

రాష్ట్రాభివృద్ధికి విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో 7 రకాల పరిశ్రములు, 11 జాతీయ విద్యాసంస్థలు స్థాపించాలని ప్రతిపాదించారు. ఒక్క పరిశ్రమ పూర్తి కాలేదు. 2015-16 నాటి లెక్కల ప్రకారం విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.11,672 కోట్లు కావలసి వుండగా, ఇప్పటి వరకు రూ.700 కోట్లకు మించి కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ ప్రాంతాల అభివృద్ధికి 24 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాల్సిన కేంద్రం మూడు సంవత్సరాలు ఏడాదికి జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున ఇచ్చి తీరని ద్రోహం చేసింది. ఉత్తరాంధ్ర లోని సుజల స్రవంతి, వంశధార వంటి ప్రాజెక్టులు, రాయలసీమ లోని హంద్రీ నీవా, గాలేరు-నగరి లాంటి సాగునీటి ప్రాజెక్టులు నిధులు లేక పూర్తిస్థాయి ఉపయోగంలోకి రాలేదు. విజయనగరంలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్శిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్శిటీలు అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాలతో నడుస్తున్నాయి. తిరుపతిలో ఐఐటి, విశాఖపట్నం ఐఐఎం, పెట్రోలియం యూనివర్శిటీ, చిత్తూరు జిల్లా ఐఐఎస్ఈఆర్, కర్నూలులో ఐఐఐటి విద్యాసంస్థలు విభజన చట్టం ప్రకారం ఈ ప్రాంతాలకు రావలసిన హక్కులు. కాని వీటిని అమలు చేయడంలో గత ఎనిమిది సంవత్సరాలుగా కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి మోసం చేస్తుంటే, వాటిని సాధించడంలో గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు ఆ బిజెపికే సాగిలపడడానికి పోటీలు పడుతున్నాయి.

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమ, కర్నూలులో రైల్వే కోచ్‌ల నిర్మాణం, చిత్తూరు జిల్లాలో కండలేరు ప్రాజెక్టు నిర్మాణం లాంటి భారీ హామీలు గాలిలో కలిసిపోయాయి. 2015 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అనంతపురం జిల్లాలో శంకుస్థాపన చేసిన బెల్, నాసెన్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం ప్రహరీగోడలు దాటి ముందుకు సాగలేదు. ఖనిజ వనరుల నిలయంగా వున్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి కేంద్ర పాలకులు అనేక ఎత్తులు వేస్తున్నారు. అనంతపురంలో అదానీ ఎనర్జీ గ్రూపుకు 52 వేల ఎకరాల భూమిని ఇవ్వడానికి భూ సర్వే జరుగుతుంది. కర్నూలు, కడప జిల్లాల్లోని అనేక భూగర్భ నిక్షేపాలను జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు. విశాఖలో ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తూ తెలుగు ప్రజల త్యాగాన్ని అగౌరవపరుస్తూ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.

నయవంచక బిజెపి

ప్రత్యేక హోదా అమలు కోసం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన సాగుతున్న సమయాన, తెలుగుదేశంతో నాలుగు సంవత్సరాల పాలనా భాగస్వామ్యం తెగిన సందర్భంగా రాయలసీమ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు రాయలసీమ డిక్లరేషన్ పేరిట హంగామా చేసింది. 2018 ఫిబ్రవరిలో కర్నూలులో బిజెపి నాయకులు సమావేశమై రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. ఇందుకోసం ఆందోళన చేపడతామన్నారు. ఇలాగే ఉత్తరాంధ్రలో హడావుడి చేశారు. వీటికి తోడు రథాలు, దేవాలయాలు, జిల్లాల పేర్ల లాంటి అనేక వివాదాస్పద అంశాల్లో చొరబడి అల్లర్లు సృష్టించి తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి, రాష్ట్రంలో ఏదో రకంగా బలపడడానికి బిజెపి ప్రయత్నిస్తూనే వుంది.

రాష్ట్ర విభజన చట్ట ప్రకారం అమలు చేయాల్సిన హామీలను...అమలు చేయకుండా, రాజధాని లాంటి అంశాల్లో బిజెపి అవకాశవాదంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల మధ్య దోబూచులాడుతూ రాష్ట్ర ప్రజలను ముంచేస్తున్నది. రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇవ్వకపోగా, విద్యుత్ మీటర్లు బిగించడం, ఓడరేవులు, రోడ్లు, గనులు, ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణ లాంటి విధానాలను వేగంగా అమలు జరుపుకుంటోంది.

రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నది. చట్ట ప్రకారం రాష్ట్రానికి రావలసిన హక్కులను సాధించలేక బిజెపి కి సాగిలపడిపోతోంది. పొరుగున వున్న తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు తమ హక్కుల సాధన కోసం కేంద్రంతో పోరాడుతూనే అక్కడి గవర్నర్లు పెడుతున్న ఆటంకాలను ప్రజల మద్దతుతో ఎదుర్కొంటున్నాయి. వాటి అనుభవాలను తీసుకోవడానికి సిద్ధంగా లేని వైసిపి ప్రభుత్వం...నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు సకల ఏర్పాట్లు చేసి ప్రసన్నం చేసుకోవాలనుకుంటోంది. ఫిరాయింపుల ప్రమాదం తమ పైకి రానున్నదనే సంకేతం ఈ మధ్యే తెలంగాణ వీడియో టేపులు చూసిన తర్వాత కూడా వైసిపి నేతలు గుర్తించకపోవడం గమనార్హం. ధృతరాష్ట్ర కౌగిలిలో చేరితే ఆ తర్వాత ఏమీ వుండదనే విషయాన్ని గుర్తించాలి.

/ వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు /

వృద్ధులు, ఆధారం లేని వారికేనా సామాజిక న్యాయం, పెన్షన్? వీధుల్లో తిరిగే ఆవులకూ ఇవ్వాలి కదా! అంటున్నారు గుజరాత్‌లోని పాలకపార్టీల నేతలు. డిసెంబరులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మనుషులతో పాటు ఆవులూ పార్టీలను ప్రభావితం చేస్తాయా అని కొందరు చర్చ చేస్తున్నారు. వట్టిపోయిన (పాలివ్వని) ఆవులను గతంలో రైతులు వధశాలలకు తరలించే వారు. కొంత రాబడి వచ్చేది. కాషాయ మూకలు గో రాజకీయాలను రంగంలోకి తెచ్చిన తరువాత అలాంటి ఆవులను అమ్ముకోలేరు. గో గూండాల దాడులకు భయపడి కొనుగోలు చేసేవారూ లేరు. దాంతో రైతులు వాటిని మేపే స్తోమత లేకనో, నష్టదాయకంగా భావించో వీధుల్లోకి వదలివేస్తున్నారు. అవి ఇబ్బడి ముబ్బడి కావటంతో గుజరాత్ హైకోర్టు అనేక సార్లు వాటి గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది. దాంతో విధిలేని స్థితిలో బిజెపి ప్రభుత్వం అలాంటి ఆవులను వదలివేసిన వారికి జరిమానా విధించే నిబంధనలతో పట్టణాలలో ఆవుల నియంత్రణ బిల్లు-2022ను తేవాల్సి వచ్చింది. ఈ బిల్లుకు నిరసనగా ఆవుల యజమానులు ఆందోళనలు చేశారు. జుమ్లా, ఉత్తినే బిల్లు తెచ్చాం తప్ప... అమలు జరపం... అని ప్రభుత్వం చెప్పినా వారు తగ్గలేదు. ఎన్నికల్లో బిజెపిని బహిష్కరిస్తాం అని అల్టిమేటం ఇచ్చారు. అనేక నియోజకవర్గాల్లో వారి ఓట్లు కీలకం, వాటికి ఎక్కడ గండిపడుతుందోనన్న భయంతో సెప్టెంబరు అసెంబ్లీ సమావేశంలో ఏకగ్రీవంగా వెనక్కు తీసుకున్నారు.

గుజరాత్‌లో గోవులకూ పెన్షన్



కబేళాలకు తరలించే ఆవులను కాపాడేందుకు ఏర్పడిన గో దళాలు రక్షించిన ఆవులను సంరక్షించేందుకు ప్రభుత్వం దాతృత్వ సంస్థలు ఏర్పాటు చేసే 450 గోశాలలకు (అవి ఎవరికి కేటాయిస్తారో చెప్పనవసరం లేదు) 2022-23లో గోమాత పోషణ యోజన కింద ఐదు వందల కోట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద గోశాలలో చేర్చిన ప్రతి ఆవుకు రోజుకు 30 రూపాయలు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుతం గుజరాత్‌లో అమల్లో ఉన్న వృద్ధాప్య పెన్షన్ పథకం కింద 60 ఏళ్లు దాటిన వృద్ధులకు నెలకు రూ.400, ఎనభై ఏళ్లు దాటిన వారికి రూ.700 ఇస్తున్నారు. ఎన్నికల కోసం ఈ మొత్తాలను రూ.1000-1250గా పెంచుతామని 2022-23 బడ్జెట్‌లో పేర్కొన్నారు.

ఆవులను గాలికి వదిలేస్తే జరిమానా వేస్తామంటే ఆవుల పెంపకందార్లు ఆగ్రహించారు. ఆ బిల్లును ఎత్తివేసి గోశాలల్లో చేర్చిన ప్రతి ఆవుకు నెలకు రూ.900 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఇప్పుడు గోశాలల నిర్వాహకులు ప్రభుత్వం మీద ధ్వజమెత్తుతున్నారు. ఈ కేటాయింపు నిధులు వెంటనే ఇవ్వాలని, ఇది ఒక ఏడాదికి పరిమితం చేయకూడదని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 1,700 గోశాలలు ఉండగా 450కి మాత్రమే అంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆవుల పెంపకందార్లు వట్టిపోయిన వాటిని వదలివేస్తే...ఇప్పుడు గోశాల నిర్వాహకులు ఆందోళనకు దిగి గోశాలల్లో ఉన్న ఆవులన్నింటినీ వీధుల్లోకి వదలాలని చూస్తున్నారు. గత నెలాఖరులో వనస్కాంత జిల్లా లోని వీధులు, ప్రభుత్వ ఆఫీసుల్లోకి వదిలారు. తదుపరి ఆందోళనలో భాగంగా జిల్లా, తాలూకా ప్రభుత్వ ఆఫీసుల్లో గోమూత్రం, పేడ చల్లుతామని ప్రకటించారు.

గుజరాత్‌లో ఆవుల పెంపకందార్లను మాల్ధారీలని పిలుస్తారు. వారిని సంతృప్తిపరచడంలో భాగంగా, వారి ఓట్ల కోసం ప్రతి పార్టీ, నేత ఆవుల మీద ప్రేమ ఒలకబోస్తుంటారు. అసెంబ్లీ లోని 182 స్థానాలకు గాను 46 చోట్ల ఈ సామాజిక తరగతికి చెందిన వారు సమీకరణలను తారుమారు చేస్తారని అంచనా. ప్రభుత్వానికి నిరసనగా ఎక్కడైతే ఆవులను ప్రభుత్వ ఆఫీసుల్లోకి వదిలారో అదే వనస్కాంత జిల్లాలోని అంబాజీలో సెప్టెంబరు 30న నరేంద్రమోడీ 'ముఖ్యమంత్రి గోమాత పోషణ యోజన' పథకాన్ని ప్రారంభించారు. ఆగస్టు నెలలో బిజెపి ఆధీనంలోని సూరత్ మున్సిపల్ అధికారులు అనుమతి లేని ఆవుల షెడ్లంటూ 222 కట్టడాలను కూల్చివేశారు. వెంటనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సిఆర్ పాటిల్ రంగంలోకి దిగి కూల్చివేతలను నిలిపి వేయించారు. ఎన్నికల రాజకీయమంటే ఇదే. గుజరాత్ ప్రభుత్వం మాల్ధారీల కోసం కామధేను విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నదని, ఆవు మూత్రం, పేడ, పాలు, నెయ్యి గురించి అక్కడ పరిశోధనలు చేస్తారని బిజెపి మాల్ధారీ విభాగ నేత సంజయ దేశాయ్ చెబుతున్నారు.

ఆవు రాజకీయాలలో కాంగ్రెసేమీ తక్కువ తినలేదు. గతంలో పశు సంవర్ధన గురించి పేర్కొన్నప్పటికీ తొలిసారిగా గో సంరక్షణ గురించి ఎన్నికల ప్రణాళికలో చేర్చారు. ఆవు పాలకు లీటరుకు ఐదు రూపాయలు అదనంగా చెల్లిస్తామని, రాజస్థాన్ పథకాలను అమలు జరుపుతామని పేర్కొన్నారు. బిజెపి, కాంగ్రెస్‌లను వెనక్కు నెట్టి అధికారాన్ని పొందుతామని చెబుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ తక్కువ తినలేదు. తమకు అధికారమిస్తే రోజుకు ప్రతి ఆవుకు రూ.40 ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఢిల్లీలో ఇస్తున్నట్లు అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. లంపీ వైరస్ కారణంగా గుజరాత్‌లో లక్షకు పైగా ఆవులు మరణించినా ప్రభుత్వం కదల్లేదని, తాము వ్యాక్సిన్లు వేస్తామని గుజరాత్ ఆమ్ ఆద్మీ నేత సుదాన్ గధ్వీ ప్రకటించారు. గుజరాత్‌లో రూ.40 ఇస్తామని ప్రకటించిన కేజ్రీవాల్ ఢిల్లీలో రూ.20 మాత్రమే ఇస్తున్నారని, మరో రూ.20 తమ ఏలుబడి లోని మున్సిపల్ కార్పొరేషన్ చెల్లిస్తున్నదని చెప్పిన బిజెపి ఢిల్లీలో కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.40 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. ఎన్నికల సిత్రాలు మరి.

- శారద

రెండేళ్లుగా కడుపు మాడ్చుకుంటున్నా న్యాయం చేయరా?

సమస్య

ధర్మాన్ని రక్షించండి...ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది అని నిత్యం పలికేచోట అధర్మం రాజ్యమేలుతోంది. రెండేళ్లుగా తిరుపతి నగరంలో న్యాయం కోసం కడుపు మాడ్చుకుని రిలే దీక్షలు చేస్తున్న అటవీ కార్మికులను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ పేద కార్మికుల న్యాయమైన సమస్యలను పట్టించుకుని పరిష్కరించే ఓపిక, తీరిక లేదన్నట్టుగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవర్తిస్తున్నది.

'అయినవారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో' అన్న లోకోక్తి ఇక్కడ అతికినట్టు సరిపోతుంది. ఒకే నీడన 362 మంది కార్మికులు 30 ఏళ్లుగా పని చేస్తుంటే 162 మందిని పర్మినెంటు చేసి, సిఐటియు ఆధ్వర్యంలో పోరాడుతున్న 200 కార్మికులను లక్ష్మీశ్రీనివాస కార్పొరేషన్‌లో కలిపివేసిన ఘన చరిత్ర టిటిడి యాజమాన్యానిది.

స్వల్ప కారణాలను సాకుగా చూపి సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా టిటిడి యాజమాన్యం, బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవర్తించాయి. 30 ఏళ్లుగా టిటిడి లోని అటవీ విభాగాన్ని నమ్ముకుని పనిచేస్తున్న 362 మంది కార్మికుల్ని పర్మినెంటు చేయమని పోరాడుతుంటే అధికార పార్టీ నేతలు తమ స్వార్థపూరిత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 200 మంది కార్మికులకు అన్యాయం చేశారు.



కందారపు మురళి

వాస్తవంగా తిరుమల కొండ పచ్చదనానికి ప్రసిద్ధి. ఒక్కసారి వచ్చిన యాత్రికులు ఈ వాతావరణానికి పులకించి మళ్లీ, మళ్లీ రావాలని కోరుకుంటారు. ప్రధాని మోడీ సైతం మెచ్చి టిటిడికి 'స్వచ్ఛభారత్' అవార్డును అందించారు. ఈ అవార్డు రావటానికి ప్రధాన కారకులు అటవీ కార్మికులని పలువురు ఐఎఎస్‌లు బహిరంగంగానే చెబుతుంటారు.

తిరుపతి నగరంలోని రోడ్ల మధ్య డివైడర్లు, పార్కులు తిరుమలలోని శిలాతోరణం, సుందరమైన పార్కుల అభివృద్ధిలో కీలకమైన పాత్రధారులు ఈ అటవీ కార్మికులు. గతంలో వేసవి రోజుల్లో ఒకసారి తిరుమల కొండ తగలబడిపోతుంటే భారత సైన్యం సైతం హెలికాప్టర్లతో మంటలను ఆర్పటానికి ప్రయత్నం చేసి చేతులెత్తేసింది. నాటి గవర్నర్ నరసింహన్ జోక్యం చేసుకుని పలు విధాలుగా ప్రయత్నం చేశారు. విధిలేని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఈ అటవీ కార్మికులు ఒళ్లంతా గోతాలు చుట్టుకుని పచ్చటి మండలు (ఆకులతో కూడిన చెట్ల భాగాలు) పట్టుకుని మంటలను ఆర్పివేసి 'శభాష్' అనిపించారు. ఇంత కష్టం చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు పూర్వ ఇ.ఓ అనిల్‌కుమార్ సింఘాల్ విశ్వప్రయత్నం చేశారు.



నవంబర్ 12కు టిటిడి అటవీ కార్మికుల దీక్షకు రెండేళ్లు

టిటిడి బోర్డు 362 మంది కార్మికులకు టైమ్ స్కేలు అమలు చేయాలని 2019లో తీర్మానించింది. తీర్మానాన్ని అమలు చేయకుండా రకరకాల సాకులు చెబుతూ వెయ్యి రూపాయల అదనపు జీతం తోడు చేసి ఇవ్వాల్సిన అలవెన్స్‌లన్నీ రద్దు చేసి టిటిడి యాజమాన్యం టైమ్ స్కేల్‌కు కొత్త భాష్యాన్ని చెప్పింది.

తాను అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో రెగ్యులరైజ్ చేస్తానని ఎన్నికలకు ముందు స్వయంగా వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని టిటిడి అటవీ కార్మికులు కలిస్తే...అరే! మీరు రెగ్యులరైజ్ కాలేదా!?...అంటూ ఆశ్చర్యం ప్రకటించి 24 గంటల్లో అమలవుతుందని ప్రకటించారు. ఆ 24 గంటలు ఎప్పుడు వస్తాయా!? అని ఏడాదిగా కార్మికులు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర హైకోర్టు సైతం ఈ కార్మికులకు సమాన పనికి - సమాన వేతనం ఇవ్వాలని ఆదేశించింది. ఆ ఆదేశం నేటికీ అమలు కావటం లేదు. 2019లో టిటిడి బోర్డు చేసిన తీర్మానం ప్రకారం టైమ్ స్కేలు అమలు చేయకపోగా కొత్త భాష్యాలు చెప్పి బలవంతంగా లక్ష్మీశ్రీనివాసా కార్పొరేషన్‌లో కలిపివేశారు. కోర్టు ఆదేశాలు ధిక్కరించిన కారణంగా రాష్ట్ర హైకోర్టులో కేసులు నడుస్తున్నాయి.

న్యాయం జరగకపోవటంతో...2020వ సంవత్సరం లో కోర్టు ఆదేశాలను, ముఖ్యమంత్రి హామీని (లేదా) టిటిడి బోర్డు తీర్మానం ప్రకారం అలవెన్స్‌లతో కూడిన టైమ్ స్కేలును అమలు చేయాలని కోరుతూ కార్మికులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలు ప్రారంభించి ఈ నవంబర్ 12వ తేదీ నాటికి రెండు సంవ్సతరాలు పూర్తవుతుంది. రెండేళ్లు కావస్తున్నా పేద అటవీ కార్మికుల కష్టాన్ని టిటిడి యాజమాన్యం పట్టించుకోకపోవటం అన్యాయం.

టిడిపి అధికారంలో ఉన్న రోజుల్లో అటవీ కార్మికులకు మద్దతుగా ప్రస్తుత రాష్ట్ర మంత్రి రోజా, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలు ఆందోళనల్లో పాలుపంచుకున్నారు. తాము అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోవడం మానేశారు. రెండేళ్లుగా వంతుల వారీగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అటవీ కార్మికులను పట్టించుకోకపోవటం ఏపాటి న్యాయమో పాలకులు చెప్పాలి.

ఈ రెండేళ్లలో అటవీ కార్మికుల దీక్షాశిబిరం వద్ద వివిధ పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు, పలువురు ప్రజా ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. కార్మికుల దీక్షా శిబిరానికి వచ్చి ప్రతి రోజూ ఫోటోలు తీసి ఇంటలిజెన్స్ పోలీసులు ప్రభుత్వానికి పంపుతున్నారు. ప్రతిరోజూ ఉదయం కార్యాలయానికి వస్తూనే 'అటవీ కార్మికుల దీక్షలు' గురించిన సమాచారం చూడాల్సి వస్తున్నదని స్వయంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణా రెడ్డి వ్యాఖ్యానించారు.

అధికారులకు, ప్రభుత్వానికి తెలియక కాదు. సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాన్ని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు అనారోగ్యంతో మరణించారు. మరికొంత మంది పని ప్రదేశాలలో పాము కాటుకు గురయి, మంటలలో కాలిపోయి, దుమ్మూధూళిలో దీర్ఘకాలికంగా పని చేస్తూ తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో కొందరు కార్మికులు ఊపిరితిత్తుల జబ్బులకు గురై మరణించారు. టిటిడిని, తిరుమల వెంకన్న స్వామిని నమ్ముకుని 30 ఏళ్లుగా పని చేస్తున్న వారిలో జీవించి ఉన్న వారికైనా న్యాయం చేయమని సిఐటియు నాయకత్వంలో పోరాడుతుంటే అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరు అమానుషంగా ఉంది.

ఇప్పటికైనా తిరుమల వెంకన్న సేవలో ఉన్న పేద అటవీ కార్మికులకు టిటిడి పెద్దలు, రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

/ వ్యాసకర్త : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి /

★

38 మంది సిట్టింగ్‌లకు టికెట్ నిరాకరణ

- గుజరాత్ ఎన్నికలకు 160 మందితో బిజెపి తొలి జాబితా

న్యూఢిల్లీ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం 160 మంది అభ్యర్థులతో బిజెపి గురువారం నాడు తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చోటు దక్కలేదు. వారి స్థానాల్లో కొత్త అభ్యర్థులను బరిలో నిలపనున్నట్లు ప్రకటించింది. ఈ జాబితాను ఢిల్లీలో కేంద్ర మంత్రి భుపేంద్ర యాదవ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ బిజెపి అధ్యక్షులు సిఆర్ పాటిల్, కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా, ఇతర నేతలు కూడా పాల్గొన్నారు. తొలి జాబితాలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివబ జడేజా, కాంగ్రెస్ నుంచి బిజెపిలోకి చేరిన హర్థిక్ పటేల్ తదితరులున్నారు. 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ నిరాకరించారు.

గుజరాత్‌లో డిసెంబరు 1న తొలి దశలో 89 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 5న రెండో దశలో 93 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలను హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఫలితాలతో పాటు డిసెంబరు 8న ప్రకటిస్తారు. ప్రజల్లో బిజెపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని, ఇటీవల జరిగిన మోర్బీ వంతెన ప్రమాదం కూడా ఇబ్బందికరంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బిజెపికి ఓటమి భయం పట్టుకున్నట్లు ఆ పార్టీ గురువారం నాడు విడుదల చేసిన తొలి జాబితా స్పష్టం చేస్తోందని వారంటున్నారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో పాత ముఖాలతో ఎన్నికలకు వెళ్లలేమని నిర్ధారణకు వచ్చి కొత్త ముఖాలకు చోటు కల్పించినట్లు వారు విశ్లేషించారు.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్ బెయిల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ బెయిల్‌పై తీర్పును పటియాల కోర్టు గురువారం తీర్పును రిజర్వ్ చేసింది. ఆర్థిక నేరస్తుడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రమేయం ఉన్న రూ. 200 కోట్ల మనీలాండరింగ్ కేసులో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నిందితురాలుగా ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఓసి)ను ఇడి జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే జాక్వెలిన్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరయింది. గురువారం విచారణలో జాక్వెలిన్‌ను ఇంకా ఇప్పటి వరకూ ఎందుకు అరెస్టు చేయలేదని ఇడిని కోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో ఇతర నిందితులు జైల్లో ఉన్నారని గుర్తు చేసింది.

బడి చదువు దక్కలేదు!

ఆన్‌లైన్ దిక్కులేదు!

- 43 శాతం మంది విద్యార్థుల పరిస్థితి
- కరోనా సమయంలో 19 నెలల పాటు ఇదే తీరు
- ఒఒఎస్‌సి అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి తీసుకొచ్చిన ప్రతికూల పరిస్థితులు అన్నీ ఇన్నీ కావు. దేశ ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. కేంద్ర సర్కారు విధించిన ప్రణాళిక లేని లాక్‌డౌన్ పరిస్థితులను మరింత కఠినతరం చేసింది. ఈ ప్రభావం వ్యాపార, వాణిజ్యాల పైనే కాకుండా విద్య పైనా పడింది. విద్యార్థులను చదువుకు దూరమయ్యేలా చేసింది. లాక్‌డౌన్ కారణంగా దేశంలో పాఠశాలల మూసివేత తర్వాత 19 నెలల పాటు 43 శాతం మంది విద్యార్థులకు ఎలాంటి ఆన్‌లైన్ విద్యనూ పొందలేకపోయారు. 'అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ (ఒఒసిసి)' అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

'క్లియరింగ్ ది ఎయిర్: ఎ సింథసైజ్డ్ మ్యాపింగ్ ఆఫ్ అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ డ్యూరింగ్ కోవిడ్-19 ఇన్ ఇండియా (ఏప్రిల్ 2020- మే 2022)' పేరుతో న్యూఢిల్లీకి చెందిన థింక్ ట్యాంక్ విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ దీనిని విడుదల చేసింది. ఏప్రిల్ 2020- మే 2022 మధ్య ప్రచురించబడిన ఇతర అధ్యయనాలను పరిగణలోకి తీసుకోకుండా, యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (యుడిఐఎస్ఇ), వార్షిక విద్యా స్థితి నివేదిక (ఎఎస్ఇఆర్) డేటాతో సహా 21 ప్రాథమిక అధ్యయన మూలాలను ఉపయోగించి నివేదికను రూపొందించారు.

స్కూళ్ల మూసివేతతో పిల్లలపై ప్రభావం

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. " ఏ ఆన్‌లైన్ విద్యనూ అందుకోని (పాఠశాల మూసివేత ప్రారంభం నుంచి సర్వే సమయం వరకు)" పిల్లల సంఖ్య 10 శాతం నుంచి 60 శాతం వరకు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు తెలిపాయి. " మహమ్మారి సమయంలో స్మార్ట్‌ఫోన్‌ల వ్యాప్తి పెరిగినట్టు కొన్ని ఆధారాలున్నప్పటికీ, 43 శాతం మంది పిల్లలు 19 నెలల వరకు ఎలాంటి పాఠశాల విద్యను పొంద లేకపోయారు (డిజిటల్ మోడ్ విద్య అందుబాటులో లేకపోవటం లేదా డిజిటల్ విద్య అందించని పాఠశాలలో చేరడం కారణంగా)" అని థింక్ ట్యాంక్ వెబ్‌సైట్ పేర్కొన్నది. మహమ్మారి కారణంగా స్కూళ్ల మూసివేతతో పిల్లలు ఎక్కువగా ప్రభావితమయ్యారని నివేదిక వివరించింది. విద్యాపరమైన అంతరాలు, విద్యా సామాగ్రి, పరికరాలు, ఇంటర్నెట్, పాఠశాల విద్యను కొనసాగించటానికి ఇతర ప్రాథమిక వనరులను పొందటంలో వివిధ సామాజిక-ఆర్థిక సందర్భాలలో పిల్లలు తీవ్రంగా ప్రభావితమయ్యారని పేర్కొన్నది.

డ్రాపౌట్లు తీవ్రం

మహమ్మారి కాలంలో పాఠశాలల్లో డ్రాపౌట్లు 1.3 శాతం నుంచి 43.5 శాతం వరకు ఉన్నదని నివేదిక పేర్కొన్నది. ఎఎస్ఇఆర్ సెంటర్ 2018 డేటా ప్రకారం కరోనా మహమ్మారి ముందున్న అంచనా గ్రామీణ భారత్‌లోని ఒఒఎస్‌సి జనాభా 2.5 శాతం కంటే దేశవ్యాప్త ఒఒఎస్‌సి జనాభా ముందస్తు అంచనాల కంటే ఎగువ శ్రేణి (43.5 శాతం) గణనీయంగా ఎక్కువగా ఉన్నదని నివేదిక పేర్కొన్నది. మహమ్మారి కారణంగా కొత్త ఆందోళనలు ఉద్భవించాయని నివేదిక వివరించింది. " చిన్న పిల్లలలో డ్రాపౌట్‌లు పెరిగాయి. వలస చిన్నారులు ఎదుర్కొంటున్న సవాళ్లను మరింత తీవ్రతరం చేసింది. తక్కువ ఫీజుతో ప్రయివేటు పాఠశాలల్లో చేరిన పిల్లల దుర్బలత్వం పెరిగింది" అని నివేదిక పేర్కొన్నది.

కాలుష్య నివారణకు సరైన పరిష్కారాలు అన్వేషించండి : సిజెఐ చంద్రచూడ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో కాలుష్య నివారణకు సరైన పరిష్కారాలను అన్వేషించాలని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ సూచించారు. ఢిల్లీ, ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో రైతులు పంటల వ్యర్థాలను పొలాల్లోనే తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోందని, దీన్ని నివారించాలంటే పంట వ్యర్థాల కాల్చివేతపై పూర్తి నిషేదం విధించాలని కోరుతూ న్యాయవాది శశాంక్ శేఖర్ ఝా పిటిషన్ దాఖలు చేశారు. దీనిని అత్యవసర ప్రాతిపదికన విచారణ చేపట్టాల్సిందిగా విన్నవించారు. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ జెబి పార్థీవాలాతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. నిషేదం విధించడం వంటివి కచ్చితంగా న్యాయవ్యవస్థ పరిధిలోకి వచ్చే అంశాలు కాదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. రైతుల పంట వ్యర్థాల కాల్చివేత తర్వాత చూద్దాం! ముందు ఢిల్లీ కాలుష్య నివారణకు మీ వద్ద ఉన్న పరిష్కారమేమిటి' అని పిటిషనర్‌ను నిలదీశారు. దీనికి న్యాయవాది శశాంక్ శేఖర్ ఝా స్పందిస్తూ ఢిల్లీలో కాలుష్య నివారణకు పంటల వ్యర్థాల కాల్చివేతపై నిషేదం అత్యంత ప్రధానమైందని పునరుద్ఘాటించారు. దీనిపై స్పందించిన సిజెఐ "కాబట్టి దీన్ని మీము నిషేధించాలా? నిషేదం విధించినంతనే ఆగిపోతుందా? పంజాబ్, యుపిలోని రైతురైతుకు నిషేదం విధించాలా?' అని ప్రశ్నించారు. అందువల్ల, ఈ అంశాన్ని ప్రాధాన్యతగా జాబితా చేయడానికి నిరాకరించారు. "మేము మీ వాదన విన్నాము. కానీ దీన్ని ఇప్పుడు విచారణకు తీసుకోం" అని పిటిషనర్‌కు స్పష్టం చేశారు. కాలుష్య నివారణకు వాస్తవ పరిష్కారాలను అన్వేషించాలని తెలిపారు.

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో కోర్టు తక్షణ జోక్యం చేసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు గత వారం అంగీకరించింది. 'ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది' అని అప్పటి సిజెఐ జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలాగే నవంబర్ 10 (గురువారం) ఈ అంశాన్ని జాబితా చేయడానికి కోర్టు అంగీకరించింది. పిటిషన్‌ను గురువారం విచారించిన సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం అత్యవసర విచారణకు తిరస్కరించింది.


కెంపేగౌడ విగ్రహం ఆవిష్కరణ

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు మహా నగర వ్యవస్థాపకులుగా ఖ్యాతిపొందిన కెంపేగౌడ విగ్రహాన్ని శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆవిష్కరించనున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 108 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఈ నిర్మాణానికి 120 టన్నుల ఉక్కు, 98 టన్నుల కాంస్యం వినియోగించారు. ఈ విగ్రహ నిర్మాణానికి రూ. 84 కోట్లు వ్యయం చేశారు. ఈ విగ్రహం చుట్టూ ఉన్న జాతీయ పార్కును కూడా మోడీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ పార్కును 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు.

గృహనిర్బంధంలో గౌతమ్ నవలఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భీమా కోరెగావ్ కేసులో నిందితునిగా ఉన్న మానవ హక్కుల కార్యకర్త గౌతమ్ నవలఖను నెల రోజుల పాటు జైలు నుంచి ఇంటికి తరలించాలని దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు గురువారం అనుమతించింది. కొన్ని షరతులతో గృహ నిర్బంధంలో ఉంచాలంటూ సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేసింది. భద్రత ఖర్చుల కింద రూ.2.4 లక్షలు డిపాజిట్ చేయాలని జస్టిస్ కెఎమ్ జోసెఫ్, జస్టిస్ హృషికేష్ రాయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం నాడు ఆదేశించింది. '2020 నుండి నవలఖ కస్టడీలో ఉన్నారు. అంత కు ముందు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆయనపై ఈ కేసు మినహా ఎటువంటి నేరపూరిత పూర్వాపరాలు లేవు. ఆయన నెల రోజుల పాటు గృహనిర్బంధంలో ఉంచడానికి అనుమతిస్తున్నాము. ఆయనను పర్యవేక్షించడానికి సాయుధ ఎస్కార్ట్‌లు ఉంటాయి" అని ధర్మాసనం పేర్కొంది. అయితే గృహ నిర్బంధాన్ని నవలఖ దుర్వినియోగం చేస్తున్నారా లేదా అని తనిఖీ చేసే పేరిట ఆ అధికారాన్ని



దుర్వినియోగం చేయరాదని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. గృహ నిర్బంధంలో ఉన్నప్పుడు నవలఖ కంప్యూటర్, ఇంటర్నెట్, మరే ఇతర కమ్యూనికేషన్ పరికరాలను ఉపయోగించరాదని షరతులు విధించింది. ఇంటర్నెట్ లేని టివి వీక్షించవచ్చునని, వార్తా పత్రికలు చదవవచ్చునని తెలిపింది. అలాగే రోజుకు 10 నిమిషాల పాటు పోలీసు సిబ్బంది అందజేసే ఫోన్‌లో మాట్లాడవచ్చునని పేర్కొంది. కుటుంబ సభ్యులను ప్రతిరోజూ 3 గంటల పాటు కలిసేందుకు అనుమతించాలని ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది. భీమా కొరెగావ్ కేసులో గౌతమ్ నవ్‌లఖాని 2018లో పోలీసులు అరెస్ట్ చేయగా, 2020లో ముంబయిలోని తలోజా జైలుకి తరలించింది.

మదురై బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- ఆరుగురు మృతి - మరో 12 మందికి గాయాలు

చెన్నయ్ : తమిళనాడులో మదురై సమీపంలోని తిరుమంగళంలోని బాణాసంచా కర్మాగారంలో గురువారం నాడు భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు. మరో 12 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరూ రాజాజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అగు జెలు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రయివేట్ బాణసంచా తయారీ కర్మాగారంలో కార్మికులు రోజువారీగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 15 మందికి పైగా కార్మికులు పనిలో ఉన్నారు. అయితే ఒక్కసారిగా ఊహించని ప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి భవనం కుప్పకూలింది. సమాచారం తెలుసుకున్న మదురై, తిరుమంగళం ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలంలో భవనం నేలమట్టమైంది. కొన్ని మతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇప్పటి వరకు ఇద్దరి మతదేహాలు లభ్యమయ్యాయి.

వారిని గుర్తిస్తామని పోలీసులు చెప్పారు. ఇక బాధితులు, మతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషాద ఘటన పట్ల ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. మృతి చెందినవారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని తెలిపారు. క్షతగాత్రులకు ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన చికిత్స అందించాలని రాజాజీ ఆసుపత్రికి సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ప్రతి పదేళ్లకొకసారి అప్‌డేట్

- ఆధార్ నిబంధనల సవరణ

న్యూఢిల్లీ : ఆధార్ నిబంధనలను ప్రభుత్వం సవరించింది. ఆధార్ కోసం నమోదు చేసుకున్న తేదీ నుంచి ప్రతి పదేళ్లకొకసారి కనీసం ఒక్కసారైన అప్‌డేట్ చేసుకోవాలని నిబంధనల్లో పేర్కొంది. గుర్తింపు రుజువులు (పిఒఐ), చిరునామా ధృవీకరణ పత్రాలు (పిఒఎ) వంటి సహాయక పత్రాలను అప్‌డేట్ చేయడం ద్వారా అప్‌డేట్ చేయవచ్చని తెలిపింది. సిఐడిఆర్‌లో కార్డుదారుల ఖచ్చితమైన సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు నిర్ధారించడానికి ఈ అప్‌డేట్ చేసుకోవాలని ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆధార్ (ఎన్‌రోల్‌మెంట్ అండ్ అప్‌డేట్) నిబంధనలను సవరించారు. కాగా, గత నెలలో కూడా యుఐడిఎఐ (ఆధార్ నంబర్లను జారీ చేసే ప్రభుత్వ సంస్థ) కూడా 10 ఏళ్ల క్రితం జారీ చేసిన నంబర్లకు వారి వివరాలను అప్‌డేట్ చేయకపోతే గుర్తింపు, నివాస పత్రాలను అప్‌డేట్ చేయాలని కోరింది.

మాలెలో అగ్ని ప్రమాదం

- 9 మంది భారతీయులు సహా 10 మంది మృతి

మాలె : మాల్దీవుల రాజధాని మాలెలో విదేశీ వర్కర్లు వుండే ఇరుకైన వసతి గృహాల్లో చెలరేగిన అగ్ని ప్రమాదంలో పది మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. చనిపోయినవారిలో 9 మంది భారత్‌కు చెందిన వలస కార్మికులుగా గుర్తించారు. అగ్నిమాపక దళ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు రిపేర్ చేసే గ్యారేజ్‌లో చెలరేగిన మంటలు మొత్తం భవనమంతా వ్యాపించినట్ల అధికారులు తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు నాలుగు గంటల పాటు పట్టిందన్నారు. అగ్ని కీలల్లో భవనం ధ్వంసమైంది. ఎగువ అంతస్తులో చిక్కుకుపోయిన కార్మికులు దారిలేకపోవడంతో బుగ్గిపాలయ్యారు. మరణించినవారిలో 9 మంది భారతీయులు, ఒకరు బంగ్లాదేశ్ జాతీయుడు వున్నారు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తుకు ఆదేశించినట్లు మాల్దీవుల అధ్యక్షులు ఇబ్రహీం మహ్మద్ సోలెహ్ ట్వీట్ చేశారు. విదేశీ వర్కర్లు నివసించే పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉంటున్నాయని మాల్దీవులకు చెందిన రాజకీయ పార్టీలు గతంలోనే హెచ్చరించాయి. మాలెలోని రెండున్నర లక్షల మంది జనాభాలో దాదాపు సగం మంది విదేశీయులే వుంటారు. ప్రధానంగా భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలకు చెందినవారు అక్కడ నివసిస్తుంటారు.

దళితులు మతం మారితే ఒబిసిలే

(మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి రాజ్యాంగ ఉల్లంఘన లేదని పేర్కొంది. ఆర్థిక, సామాజిక వెనుకబాటుకు దారితీసే అంటరానితనం వ్యవస్థ హిందూ సమాజంలో ఉన్నంత ప్రబలంగా క్రైస్తవ, ముస్లిం సమాజంల్లో లేదని తెలిపింది. కాగా దళిత ముస్లింలు, దళిత క్రిస్టియన్‌లను షెడ్యూల్డ్ తరగతులు (ఎస్‌సి)గా గుర్తించేందుకు సంబంధించిన అంశంపై త్రిసభ్య కమిటీ వేశామని, ఆ కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోందని, అందువల్ల పిటిషనర్లు అధ్యయన నివేదిక వచ్చేదాక వేచిచూడాలని కేంద్రం తెలిపింది. క్రైస్తవులు, ముస్లింలు 27 శాతం ఒబిసి రిజర్వేషన్‌లకు మాత్రమే అర్హులని, అలాగే పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, హాస్టల్స్, జాతీయ వెనుకబడిన తరగతుల ఫైనాన్స్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపట్టే ఇతర ఆదాయ ప్రయోజనాలను పొందగలరని తెలిపింది. మైనారిటీల కోసం ఉద్దేశించిన పథకాలకు, ఇతర ప్రయోజనాలకు ఆయా మతాలను స్వీకరించిన దళితులు కూడా అర్హులేనని పేర్కొంది.

ముగిసిన ప్రచారం

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. ఈ రాష్ట్రంలో మొత్తం 68 అసెంబ్లీ ఎన్నికలకు ఒకే దశలో శనివారం ఎన్నికల జరగనున్నాయి. బిజెపి, కాంగ్రెస్‌తో పాటు ఆప్ కూడా పోటీలో ఉంది. సిపిఎం 11 స్థానాల్లో పోటీ చేస్తోంది.





మీకోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెబ్బలను పేస్టులా చేసి, స్పూన్ తేనెతో కలిపి పిల్లలకు తినిపించాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా కోలుకుంటారు.

జీవన సౌరభం

ఇతరులకు స్వేచ్ఛ నిరాకరించేవారు తమ స్వేచ్ఛ పొందుటకు అర్హులు కారు.

మిల్కీ - లక్కీ



విజయపురం గ్రామంలోని పాఠశాలలో మిల్కీ, లక్కీ ఆరవ తరగతి చదువుతున్నారు. వారు ప్రాణ స్నేహితులు. చదువులోనే కాకుండా, ఆట పాటల్లో కూడా అత్యంత ప్రతిభ కనబర్చి ఉపాధ్యాయుల చేత ప్రతిరోజూ ప్రశంసలు పొందేవారు. పాఠశాల పక్కనే వ్యవసాయ మార్కెట్ ఉంది. చాలామంది రైతులు తాము పండించిన పంటను మార్కెట్‌కు తెచ్చి అమ్ముకునేవారు. ఒక రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆరవ తరగతి విద్యార్థులు పాఠశాల మైదానంలో కొందరు కబడ్డీ, మరికొందరు ఖోఖో ఆటలు ఆడుతున్నారు. అప్పటివరకు పొడిగా, ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.

మేఘాలు కమ్ముకున్నాయి. వర్షం వచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లక్కీ ఆట ఆపి, మార్కెట్ వైపు చూసింది. రైతులు మార్కెట్లో ఎండబోసిన ధాన్యాన్ని తడవకుండా కుప్పలు చేస్తున్నారు. రాబోయే వర్షాన్ని తలుచుకుని కంగారుపడుతున్నారు. ఎలా చూసినా ఈ రోజు రైతుల ధాన్యం తడుస్తుందని లక్కీకి అర్థమైంది. వెంటనే మిల్కీకి చెప్పింది.

మిల్కీకి ఒక ఆలోచన వచ్చింది. మైదానంలో ఆడుకుంటున్న అరవ తరగతి విద్యార్థులకు తన ఆలోచన చెప్పింది. క్షణం ఆలస్యం చేయకుండా అందరూ మార్కెట్లోకి వెళ్ళి ధాన్యం కుప్పలు చేయడంలో సహాయం చేశారు. అది చూసి మిగతా తరగతుల విద్యార్థులు కూడా రైతులకు సహాయం చేశారు. పదిహేను నిమిషాల్లో ధాన్యం కుప్పలపై పరదా కవర్లు కూడా కప్పారు.

ఇంతలో వర్షం ప్రారంభమైంది. చిరుజల్లులతో మొదలైన వర్షం కుండపోతగా కురిసింది. విద్యార్థులు సమయానికి సహాయం చేయడం వలన రైతుల ధాన్యం తడవలేదు. రైతులు విద్యార్థులకు కృతజ్ఞతలు చెప్పారు. విద్యార్థుల సామాజిక సేవను ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు. మరుసటిరోజు ప్రార్థన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులందరిని ప్రశంసించి లక్కీ, మిల్కీలకు బహుమతులు ఇచ్చారు.

- దుర్గమ్ భైతి
రామునిపట్ల, సిద్దిపేట జిల్లా.



కనిపెట్టండి

పిల్లలూ ఇక్కడ పెద్ద జ్యూస్ గ్లాసు నుంచి చిన్న గ్లాసుల దగ్గరకు వెళ్లేందుకు ఒకే ఒక్క దారి ఉంది. అదేంటో కనిపెట్టండి.

నేను గీసిన బొమ్మ





వి.హర్షిత, 7వ తరగతి
అరవింద హైస్కూల్, కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలు పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీరేం చేస్తున్నారు? మాకేం నేర్పుతున్నారు?



చిన్నారి పొన్నారి పిల్లలం.. చీకూ చింత లేని వాళ్లం.. ప్రశ్నించడం, పరిశీలించడం.. ఫిర్యాదు చేయడం, ఆరా తీయడం.. మా లక్షణం. మంచైనా.. చెడైనా.. మీ నుంచే నేర్చుకుంటాం.. మరి పెద్దలుగా మీరేం చేస్తున్నారు.. మాకేం నేర్పుతున్నారు?

పొద్దున్నే నిద్రలేవగానే అమ్మ అదే పనిగా తిడుతూ ఉంది. ఏంటా అని ఆరా తీశానా.. అంతే 'వెధవ పిల్లి గుమ్మంలోనే తగలడాలా! లేచి లేవగానే దాని మొఖం చూశాను. ఇవ్వాళ ఏమౌతుందో ఏంటో! నాకు చాలా కంగారుగా ఉంది' అంటూ గాబరా పడిపోతూ చెప్పింది.

మొన్న స్కూలు నుంచి ఇంటికి వస్తుంటే రోడ్డు మీద నిమ్మకాయలు తొక్కాను. అప్పుడు కూడా అమ్మ చాలా కంగారుపడిపోయింది. ఏం జరుగుతుందో ఏంటోనని దిగాలు పడిపోయింది.



ఇంకోరోజు నాకు బాగా గుర్తు చలి జ్వరం వచ్చి స్కూలు నుంచి ఇంటికి వచ్చేశాను. సాయంత్రం హాస్పటల్‌కి తీసుకెళ్లింది. మరుసటి రోజు ఉదయాన్నే నాన్నను ఎక్కడికో పంపించి గొట్టంలా ఉన్న ఓ చిన్న వస్తువేదో కట్టిన ఓ నల్లదారం తెప్పించి నా మెడకు కట్టింది.

ఇలాగే మా ఫ్రెండ్స్ కొందరు ఒంట్లో బాగోలేదని రెండు రోజులు స్కూలు మానేసి ఆ తరువాత రోజు స్కూలుకు వచ్చేటప్పుడు మెడలోనో.. మొలకో ఏదో నల్లతాడు కట్టుకుని వస్తారు. ఇదేంట్రా అని అడిగితే.. 'ఏమోరా మా అమ్మ కట్టింద'ని చెప్పేవారు.

చెల్లి ఒకరోజు అన్నం తిననని మారాం చేసింది. 'రోజూ చారేనా..' అని దాని ఫిర్యాదు. అమ్మ మాత్రం 'మొన్న దసరా పండగ రోజు కొత్త గౌను వేసుకుని ఊరంతా తిరిగావు. ఎవరివో దిష్టి కళ్లు పడ్డాయి. తిండి పడిపోయింది' అంటూ ఎడం చేత్తో ఉప్పు తీసుకుని ఏవేవో అర్థం కానివి మాట్లాడుతూ తూ.. తూ.. అని చేతిలో ఊస్తూ చెల్లి తల చుట్టూ తిప్పింది.

నిన్నేమో.. పెన్సిల్ కొనుక్కోమని నాన్న డబ్బులిస్తే నేనేమో చాక్లెట్లు కొనుక్కున్నాను. డబ్బులేమయ్యాయని నాన్న గట్టిగా అడిగితే భయం వేసి ఎక్కడో పడి పోయాయని చెప్పాను. 'అబద్ధం చెప్పకు.. అబద్ధాలు చెప్పే పిల్లలంటే దేవుడికి ఇష్టం ఉండదు..' అని నాన్న చెంప చెళ్లుమనిపించాడు.

మొన్న పండక్కి పెద్దమ్మ వాళ్లింటికి వెళ్లానా.. ఆ రోజు అక్కకి పరీక్షలంట.. కంగారుగా బయలుదేరుతూ దేవుడి పటం చుట్టూ మూడు సార్లు తిరిగి దణ్ణం పెట్టుకుంది. ఎందుకు అలా చేసిందని పెద్దమ్మనడిగితే.. 'పరీక్షలు బాగా రాయాలంటే దేవుడి ఆశీర్వాదం తప్పక తీసుకోవాలి' అని చెప్పింది.

అమ్మమ్మ వాళ్లింటికి బయలుదేరదామని అమ్మ చెప్పగానే చాలా హుషారుగా నేను, చెల్లి తయారయ్యాం. ఇంటికి తాళం వేసి బయటికి నడుస్తుంటే నాకు తుమ్మొచ్చి తుమ్మాను. అంతే... శుభమా అని బయలుదేరుతుంటే ఇప్పుడేంట్రా' అని విసుక్కుంటూ తాళం తీసి ఇంట్లోకి లాక్కెళ్లింది. అంతకుముందు పండక్కి నానమ్మ ఊరు బయలుదేరేటప్పుడు కూడా ఇలాగే జరిగింది. నాన్న బండి మీద మేమందరం సర్దుకుని కూర్చొని బయలుదేరుతుంటే ఎదురుగా పిల్లి అడ్డు వచ్చింది. అప్పుడు నాన్న బండి ఆపేసి ఆ రోజు ప్రయాణం వద్దన్నాడు. తరువాత రోజు మంగళవారమని అమ్మ వద్దంది. నాలుగురోజుల సెలవుల్లో రెండు రోజులు ఇలా పోయి నానమ్మ ఊరి ప్రయాణం క్యాన్సిల్ అయ్యింది. అప్పుడు ఎంత బాధేసిందో..

మిమ్మల్ని.. మీరు చేసే పనులని బాగా పరిశీలిస్తున్న మేము మాకు తెలియకుండానే మిమ్మల్ని అనుసరిస్తున్నాం. మొన్న స్కూలుకు బాగా ఆలస్యమైపోయింది. నాన్న తొందర పెడుతున్నాడు. కంగారుగా బయలుదేరుతుంటే.. చెల్లి తుమ్మింది.. వెంటనే నేను స్కూలు బ్యాగు తీసేసి ఇంట్లోకెళ్లి కూర్చొన్నాను. అది చూసి అమ్మా నాన్న ఒకళ్ల మొఖం ఒకరు చూసుకున్నారు. ఇంకోరోజు మా ఫ్రెండ్స్‌తో ఆడుకుంటుంటే పిల్లి పిల్లలు కనిపించాయి. వాటిని చూడగానే ఎంత కోపమొచ్చిందో.. రాళ్లతో కొట్టాను. అప్పుడు అమ్మ బాగా తిట్టింది. చిన్న పిల్లలు చనిపోతాయని చెప్పింది. మొన్న ఒక రోజు చెల్లి ఒళ్లు జ్వరంతో కాలిపోతుంటే హాస్పటల్‌కు తీసుకెళ్దామని అమ్మా, నాన్న బయలుదేరారు. ఇంజక్షను చేస్తారని భయం వేసి 'నేను రాను. అన్నయ్యకు తెచ్చినట్లుగా నాకూ నల్లదారం తెండి. మెడకి కట్టండి.. జ్వరం తగ్గిపోతుంది' అని ఏడుస్తున్న చెల్లిని బలవంతంగా లాక్కెళ్ళారు.


అసలు నాకర్థం కానిదేంటంటే.. చెల్లి అన్నం తినకపోవడానికి, ఊరు ప్రయాణాలు ఆగిపోవడానికి, జ్వరం తగ్గడానికి, అబద్ధం చెప్పకూడదని, పరీక్షలు బాగా రాయాలని మీ పెద్దవాళ్లు చెప్పిన కారణాలు.



మీరెందుకు ఇలా చేస్తున్నారు? జ్వరం వచ్చినప్పుడు హాస్పటల్‌కు తీసుకెళ్లారుగా.. మరి నల్లదారమెందుకు? ఊరి ప్రయాణం చేయడానికి పిల్లికి, తుమ్మడానికి సంబంధమేంటి? పరీక్షలు బాగా రాయడానికి దేవుడికి దణ్ణం పెట్టడానికి లింకేంటి? మేం తప్పు చేస్తే మీరు కొడతారనో.. తిడతారనో కదా భయపడాలి. దేవుడి పేరు ఎందుకు చెబుతున్నారు? ఇవన్నీ మీరు నమ్మి మమ్మల్నీ నమ్మించేలా చేస్తున్నారు. ఏది నమ్మాలో.. ఏది నమ్మకూడదో.. తెలియక తికమక పడిపోతున్నాం.. మేం చేసే ప్రతి పనీ మీ నుంచి నేర్చుకున్నదే.. మా ఆలోచనలకి, ఆశయాలకి జ్ఞానమనే పునాదులు మీరే వేయాలి. అజ్ఞానం పారదోలాలి. అందుకే అమ్మానాన్నా, అమ్మమ్మ నాన్నమ్మా తాతయ్యా .. మీరేం చేస్తున్నారు? మాకేం నేర్పుతున్నారు?

- శ్రీజ్ఞ

మహిళా సమస్యలపై సినిమాలు రావాలి : తమిళ దర్శకుడు



మహిళల సమస్యలను ఎలా ధైర్యంగా ఎదుర్కోవాలో తెలిపే లేడీ ఓరియంటెడ్ చిత్రాలు రావాలని తమిళ దర్శకుడు ఆర్.క్లైవర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆయన తొలిసారి దర్శకత్వం వహించిన 'అనల్ మేలే పనితులి' చిత్రం ఈ నెల 18న సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రంలో ఆంధ్రియా జెరెమియా, ఆదవ్ కన్నదాసన్ ప్రధాన పాత్రల్లో నటించారు. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాణ సారథ్యంలో ఫీమేల్ సెంట్రిక్ మూవీగా తెరకెక్కింది. 'సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై సినిమాలు రావాలి. తమకు ఎదురయ్యే సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పడమే బయటపడాలి. అలాంటి కథాంశంతోనే ఈ సినిమా రూపొందించాం. ఇది నాకు తొలి చిత్రమైనప్పటికీ గతంలో అసోసియేట్, కోడైరెక్టరుగా, మాటల రచయితగా పని చేసిన అనుభవం ఉంది. థియేటర్‌లోనే విడుదల చేయాలని భావించాం. కానీ, కరోనా కారణంగా మా ఆలోచనల్ని తారుమారయ్యాయి. అందుకే ఓటీటీలో రిలీజ్ చేస్తున్నాం' అని దర్శకుడు క్లైవర్ ఆనంద్ ఈ సందర్భంగా వివరించారు.




'మిస్టర్ తారక్' ట్రైలర్ విడుదల

తారకరత్న నటించిన కొత్త చిత్రం 'మిస్టర్ తారక్'. ఈ చిత్రానికి రమేష్ విబూది దర్శకత్వం వహించారు. పూసల మధు నిర్మించారు. ఇందులో తారకకి జోడీగా షారా నటించారు. తాజాగా చిత్రయూనిట్ మూవీ ట్రైలర్‌ని విడుదల చేసింది.

11 భాషల్లో 'ది వ్యాక్సిన్ వార్'

బాలీవుడ్ దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి చిత్రానికి సంబంధించిన తాజా సమాచారం వెల్లడించారు. 'ది వ్యాక్సిన్ వార్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం దేశంలో కోవిడ్-19, టీకా పరిశోధన గురించి కొన్ని అధ్యాయాలను చూపిస్తుందని తెలిపారు. హిందీతో పాటు 11 ఇతర భాషలలో, ఇంగ్లీష్, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం, కన్నడ, ఉర్దూలో కూడా ఈ చిత్రం విడుదల కానుంది. గురువారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఆగస్ట్ 15, 2023న థియేటర్లలో విడుదల కానుంది. ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పల్లవి జోషి, అభిషేక్ అగర్వాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.



20న నాగశౌర్య వివాహం



నాగ శౌర్య త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. బెంగుళూరులో అనూష శెట్టితో ఈ నెల 20న ఈ పెళ్లి జరగబోతోంది. ఇది ప్రేమ వివాహం అని నాగశౌర్య తండ్రి తెలియచేశారు. అనూష శెట్టి బెంగుళూరులో ఇంటీరియర్ డిజైనర్, ఆర్కిటెక్ట్ కూడా. ఆమెకి కర్ణాటక స్టేట్ టాప్ ర్యాంక్ కూడా వచ్చిందని తెలుస్తోంది. పెళ్లికి వచ్చే వాళ్లు భారతీయ సాంప్రదాయ దుస్తులను ధరించి మాత్రమే రావాలని శుభలేఖలో పేర్కొన్నారు.

ఓటీటీలోకి 'ఓరి దేవుడా'

విశ్వక్ సేన్, మిథిలా పాల్కర్, ఆశా భట్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన తాజా చిత్రం 'ఓరి దేవుడా'. వెంకటేశ్ అతిథి పాత్రలో నటించారు. తమిళ చిత్రం 'ఓ మై కడవులే'కి రీమేక్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి మాతృక డైరెక్టర్ అశ్వత్ మారిముత్తునే తెలుగులోనూ దర్శకత్వం వహించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అనుకున్న దాని కంటే ముందే ఓటీటీ విడుదలకి సిద్ధమైంది. 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్‌కానుందని ప్రకటించారు. 'నవంబర్ 11 రాత్రి 12 గంటలకు 'ఓరి దేవుడా' ప్రీమియర్ కాబోతోంది' అంటూ ఆహా యాజమాన్యం సోషల్ మీడియాలో పోస్టు చేసింది. పీవీపీ సినిమా, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందించారు.



'డ్రైవర్ జమున' వాయిదా

ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన 'డ్రైవర్ జమున' చిత్రం వాయిదా పడింది. రోడ్ థ్రిల్లర్‌గా రూపొందించబడిన ఈ సినిమా ఈ రోజు విడుదల కావాల్సి ఉంది. అయితే కొన్ని అనుకోని సమస్యల కారణంగా ఈ చిత్రాన్ని విడుదల చేయడం లేదని మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది. పి కిన్స్లిన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆడుకలం నరేన్, అభిషేక్, రాజేష్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. జిబ్రాన్ సంగీతం అందించారు.



సెమీస్‌లో టీమిండియా చిత్తు

- ఇంగ్లండ్ చేతిలో 10వికెట్ల తేడాతో ఘోర పరాజయం
- బట్లర్, హేల్స్ వీర విహారం
- టి20 ప్రపంచకప్

అడిలైడ్: టి20 ప్రపంచకప్‌లో టీమిండియా కథ ముగిసింది. గురువారం ఇంగ్లండ్ జరిగిన రెండో సెమీస్‌లో భారతజట్టు 10వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారతజట్టు బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించినా.. బౌలింగ్‌లో చేతులెత్తేసింది. ప్రత్యర్థి జట్టు వికెట్టు తీయడంలో పూర్తిగా విఫలమైన భారత బౌలర్లు... ఇంగ్లండ్ బ్యాటర్స్‌ను ఔట్ చేయడంలో విఫలమయ్యారు. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు భారత్‌ను ఆహ్వానించింది. ఓపెనర్ కెఎల్ రాహుల్(5) మరోసారి విఫలం కాగా... కీలక మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్(14) త్వరగా పెవిలియన్‌కు చేరిపోయాడు. రిషబ్ పంత్(6) మరోసారి చేతులెత్తేశాడు. ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా అర్ధసెంచరీలతో రాణించినా... ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యాన్ని టీమిండియా నిర్దేశించలేకపోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ(27) కాస్త పర్వాలేదనిపించినా.. ఇంగ్లండ్ ముందు 169 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే టీమిండియా ఉంచగలిగింది. ఛేదనలో ఇంగ్లండ్ కెప్టెన్ జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. బట్లర్‌కు తోడుగా మరో ఎండ్‌లో ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన అలెక్స్ హేల్స్ కెప్టెన్‌ను కంటే ధాటిగా ఆడాడు. ఇంగ్లండ్‌జట్టు ఒక్క వికెట్



ఇంగ్లండ్‌ను గెలిపించిన బట్లర్-హేల్స్

పడకుండానే జట్టుకు విజయాన్నందించి టి20 ప్రపంచకప్ ఫైనల్‌లోకి తీసుకెళ్లారు. బట్లర్ 48బంతులను ఎదుర్కొని 9ఫోర్లు, 3సిక్సర్లతో 80పరుగులు చేయగా.. మరో ఎండ్‌లో హేల్స్ 47బంతులను ఎదుర్కొని 4ఫోర్లు, 7సిక్సర్లతో ఏకంగా 86పరుగులు రాబట్టాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు మరో 4ఓవర్లు మిగిలి ఉండగానే 170పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అలెక్స్ హేల్స్‌కు లభించింది.

టి20ల్లో కోహ్లీ నయా రికార్డు..

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టి20ల్లో 4వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. అడిలైడ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీస్‌లో విరాట్ 4వేల మార్కును అధిగమించాడు. మొత్తంగా 115మ్యాచ్‌ల్లో 4008 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇందులో ఒక సెంచరీ, 36 అర్ధశతకాలు ఉన్నాయి. కోహ్లీ తర్వాత 3,853 పరుగులతో రోహిత్ శర్మ రెండో స్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ ఆటగాడు గప్టిల్(3,497), పాక్ కెప్టెన్ బాబర్ అజామ్(3,323), ఐర్లాండ్ ఆటగాడు స్టిర్లింగ్ (3,181) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: కెఎల్ రాహుల్ (సి)బట్లర్ (బి)వోక్స్ 5, రోహిత్ (సి)కర్రన్ (బి)జోర్డాన్ 27, కోహ్లీ (సి)రషీద్ (బి)జోర్డాన్ 50, సూర్యకుమార్ (సి)సాల్ట్ (బి)రషీద్ 14, హార్దిక్ (హిట్‌వికెట్) జోర్డాన్ 63, పంత్ (రనౌట్) బట్లర్/జోర్డాన్ 6, అశ్విన్ (నాటౌట్) 0, అదనం 3. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 168పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/56, 3/75, 4/136, 5/158, 6/168 **బౌలింగ్:** స్టోక్స్ 2-0-18-0, వోక్స్ 3-0-24-0, సామ్ కర్రన్ 4-0-42-0, ఆదిల్ రషీద్ 4-0-20-1, లివింగ్‌స్టోన్ 3-0-21-0, జోర్డాన్ 4-0-43-2

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బట్లర్ (నాటౌట్) 80, అలెక్స్ హేల్స్ (నాటౌట్) 86, అదనం 4. (16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 170పరుగులు. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-25-0, అర్ష్‌దీప్ 2-0-15-0, అక్షర్ పటేల్ 4-0-30-0, షమీ 3-0-39-0, అశ్విన్ 2-0-27-0, హార్దిక్ పాండ్యా 3-0-34-0.

టి20 ప్రపంచకప్‌కు ముందు ట్రయాంగులర్ సిరీస్‌లో అమ్మాయిలు

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చే ట్రయాంగులర్ సిరీస్‌లో భారత మహిళలజట్టు ఆడనుంది. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, భారత మహిళలజట్ల మధ్య జరిగే ట్రయాంగులర్ సిరీస్ వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరిలో జరగనుంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ప్రతి జట్టు రెండేసిసార్లు మిగతా జట్లతో తలపడనుంది. ఇక ఫైనల్ ఫిబ్రవరి 2న జరగనుంది. ఐర్లాండ్ పోర్ట్స్‌లో జరగనుంది. ట్రయాంగులర్ సిరీస్ ముగిసిన అనంతరం ఫిబ్రవరి 10నుంచి న్యూజిలాండ్స్ కేప్‌టౌన్ వేదికగా మహిళల ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 26న కేప్‌టౌన్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుండగా.. ప్రపంచకప్ టోర్నీలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు గ్రూప్-ఎలో ఉండగా.. గ్రూప్-బిలో ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్తాన్, భారత్‌తోపాటు వెస్టిండీస్ జట్లు ఉన్నాయి.



షెడ్యూల్..

జనవరి 19	:	దక్షిణాఫ్రికా	×	ఇండియా
జనవరి 21	:	దక్షిణాఫ్రికా	×	వెస్టిండీస్
జనవరి 23	:	ఇండియా	×	వెస్టిండీస్
జనవరి 25	:	దక్షిణాఫ్రికా	×	వెస్టిండీస్
జనవరి 28	:	దక్షిణాఫ్రికా	×	ఇండియా
జనవరి 30	:	వెస్టిండీస్	×	ఇండియా
ఫిబ్రవరి 2	:	ఫైనల్		

ఫిఫా ప్రపంచకప్‌కు జర్మనీ, బెల్జియం జట్ల ప్రకటన

రోమ్: ఖతార్ వేదికగా నవంబర్ 20నుంచి జరిగే ఫిఫా ప్రపంచకప్‌లో ఆడే జర్మనీ, బెల్జియం జట్లను ఆయా దేశాల ఫుట్‌బాల్ సమాఖ్యలు గురువారం ప్రకటించాయి. జర్మనీ జట్టులో 17ఏళ్ల ప్రయుకర్ యూసౌఫా మౌకోకో అనూహ్యంగా జట్టులో చోటు దక్కించుకోగా.. బోరుసియా డార్ట్‌మౌండ్‌కు చెందిన మార్కో రూస్, మాట్స్ హమ్మెల్స్‌కు చోటు దక్కలేదు. ఈ ఏడాది జరిగిన బండెస్లిగా లీగ్‌లో మౌకోకు ఆరు గోల్స్‌తో రాణించాడు. ఇక బెల్జియం జట్టు 26మంది ఆటగాళ్ల జాబితాను వెల్లడించింది. గాయపడ్డ స్ట్రయికర్, ఇంటర్ మిలాన్‌కు చెందిన రోమేలు లుకాకు కూడా జట్టులో చోటు కల్పించారు. కోచ్ రాబర్టో మార్టినెజ్ మాట్లాడుతూ... 68గోల్స్‌తో జాతీయ జట్టులో అత్యధిక గోల్స్ కొట్టిన లుకాకును కనీసం ఒక్క గేమ్‌లోనైనా ఆడేందుకు ఉపయోగించుకుంటామని పేర్కొన్నాడు. గ్రూప్-ఎఫ్‌లో బెల్జియంతోపాటు కెనడా, మొరాకో, క్రొయేషియా జట్లు ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68